ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 107

శుక్రవారం 18 అక్టోబర్ 2024 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ / HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD




## 46 పరుగులకే కుప్పకూలిన భారత్

.. వివరాలు 7లో

## హర్యానా సీఎం నాయబ్ సింగ్ సైనీ ప్రమాణ స్వీకారం

హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, చంద్రబాబు

చండీగఢ్, (రోమింగ్ న్యూస్) : హర్యాన ముఖ్యమంత్రి గా నాయబ్ సింగ్ సైనీ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 90 అసెంబ్లీ స్థానాలకు గానూ 48 చోట్ల బీజేపీ గెలుపొందింది. గవర్నర్ బండారు దత్తాత్రేయ.. నాయబ్ సింగ్‌తో ప్రమా ణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ , ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు.



04

## పౌరసత్వ చట్టం సెక్షన్ ఏ రాజ్యాంగబద్ధమే

సమర్థించిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ, (రోమింగ్ న్యూస్) : పౌరసత్వ చట్టం 1955 లోని సెక్షన్‌ఏ రాజ్యాం గబద్ధతను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోమిశ్రా ధర్మాస నం 4:1 మెజారిటీతో రాజ్యాంగబద్ధతను సమర్థిస్తూ గురువారం తీర్పును వెలువరించింది.



02

## జివో నెంబర్ 29ని రద్దు చేయాలి

- మళ్లీ ప్రిలిమ్స్ నుంచి పరీక్షల ప్రక్రియ
- పాత జివో ప్రకారమే ఎగ్జామ్ జరపాలని అభ్యర్థన
- పిసిసి చీఫ్, కేటీఆర్‌లతో విడివిడిగా అభ్యర్థుల భేటీ




## మద్యం ధరలపై కన్నేసిన ప్రభుత్వం!

ధరలు పెంచే యోచనలో సర్కార్



5 లో..

## మూసీలోకి కెమికల్ నీళ్లు రాకుండా చూసుకోవాలి

ఎంపీ ఈటల రాజేందర్



4 లో..

## బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

రాబోయే ఐదురోజులు వానలు



4 లో..




# మూసీ సుందరీకరణ కాదు.. పునరుజ్జీవం

## మూసీ మురికి నుంచి పేదలను కాపాడుతాం



- మూడు నెలలు కేటీఆర్, హరీశ్, ఈటల అక్కడ ఉంటారా
- వారికి సకల సౌకర్యాలు కల్పించి ఉంచుతాం
- పేదలను తరిమి కొట్టేంత దుర్మార్గం చేయలేదు
- మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ బాధితులను హింసించింది మరిచారా : సీఎం రేవంత్

తాము చేపడుతు న్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవనమని ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి తెలిపారు. దీనిని వక్రీకరించి ప్రజల ను తప్పదోవ పట్టిస్తున్న పార్టీలపై ఆయన ఆగ్రమం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూసీనది అభివృద్ధి ప్రాజెక్టు వివరాలు వెల్లడించారు.

హైదరాబాద్, (రోమింగ్ న్యూస్) : 'మూసీ దుర్గంధంలో మగ్గి పోతున్న వారికి మెరుగైన జీవితం ఇవ్వాలని ఈ ప్రాజెక్టు తలపెట్టామని అన్నారు. నగరం మధ్య గుండా నది వెళ్తున్న రాజధాని మరొ కటి ఈ దేశంలో లేదు. దాదాపు 300 కిమీ ప్రవహించే

మిగతా 2 లో

## బీఆర్ఎస్ తెలంగాణ అస్తిత్వ పార్టీ

- తెలంగాణ కోసం కొట్లాడేది కేవలం మన పార్టీయే
- ఇది కేసీఆర్, కేటీఆర్‌దో కాదు...తెలంగాణ ప్రజలది
- కాంగ్రెస్ పాలనలో దోపిడీ పెరిగింది
- బీజేపీ మత రాజకీయాలు చేస్తోంది
- బీఆర్ఎస్‌వీ సమావేశంలో కేటీఆర్ విమర్శలు



రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడే ప్రసక్తే లేదు.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బంద్ అయితే.. సమాజం తరపున కొట్లాడడం బంద్ అయితే.. పేద ప్రజల తరపున మాట్లాడడం బంద్ అయితే తెలంగాణ మూగబోతది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎందుకంటే బీజేపోడు మాట్లాడడు.

హైదరాబాద్, (రోమింగ్ న్యూస్) : తెలంగాణన నాశనం చేసిన బీజేపోడు మెసలడు. బడే భాయ్ చోటే భాయ్ ఒక్కటే. పైననేమో జూమ్లా పీఎం.. ఇక్కడ్నేమో హౌలా సీఎం.. ఈయనకు ఏం తెల్వది.. ఆగమాగం అవు తున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ ఎస్వీ సమావేశంలో కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోచుకోవడంలో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఓ బిల్డర్ తనకు వద్దకు వచ్చి.. హైదరాబాద్‌లో కరెంట్ కనెక్షన్ కోసం 25 లక్షలు సమర్పించు కున్నట్లు చెప్పాడు. కాంగ్రెస్ నేతలు అందినకాడికి

మిగతా 2 లో

## పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు

అధికారులను ఆదేశించిన సిఎస్ శాంతి కుమారి



హైదరాబాద్, (రోమింగ్ న్యూస్) ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను ఏవిధమైన పొరపాట్లు లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో సీఎస్ సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

మిగతా 2 లో

## బతుకమ్మ చీరలపై పొంతనలేని మాటలు

చీరలు లేకుండానే ముగిసిన బతుకమ్మ

సీతక్క మాటలు అర్థం లేనివంటూ హరీష్ విమర్శలు

హైదరాబాద్, (రోమింగ్ న్యూస్) తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రతి బతుకమ్మ పండుగకు రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చీరలను పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఆ బతుకమ్మ చీరలతో ఆడబి డ్డలు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేవారు. కానీ కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చాక బతుకమ్మ చీరలు మాయమయ్యాయి. బతుకమ్మ చీరలపై ప్రజలు ప్రశ్నిస్తే.. మంత్రులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. కేసీఆర్ ఏటా ఇచ్చే బతుకమ్మ చీరలను కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి ఎందుకు బంద్ చేసిందన్న దానికి





05

## రేవంత్‌వి తేనె పూసిన మాటలు

మరో ఉద్యమానికి సిద్దం కావాల్సిందే : మందకృష్ణ మాదిగ హెచ్చరిక

మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వ హించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
18 అక్టోబర్
2024



## బీఆర్ఎస్ తెలంగాణ అస్తిత్వ పార్టీ



(మొదటిపేజీ తరువాయి)

దోచుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. గత పది నెలల్లో అత్యంత కష్టకాలాన్ని ఎదుర్కొన్నాం. ఎవరూ ఊహించని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ప్రతిపక్షంలో కూర్చుంటామని ఊహించలేదు. డిసెంబర్ 7న కేసీఆర్ కు ప్రమాదం జరగడం.. మూడు నెలల పాటు ఇబ్బందికి గురయ్యారు. ఓ పది మంది ఎమ్మెల్యేలు ప్రలోభాలతో దొంగల్లో కలిసిపోయారు. మన ఆడబిడ్డ కవితమ్మను ఐదున్నర నెలలు జైల్లో పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో కొట్లాడినం, పోరాడినం కానీ ఎవరికి లొంగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించిన దానికి భిన్నంగా ఫలితాలు వచ్చాయి. ఇవాళ కేసీఆర్ ను తలచుకుంటున్నారు. కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, బతుకమ్మ చీరలు వస్తుండే అని అనుకుంటున్నారు. కులమతాలకు అతీతంగా కేసీఆర్‌ను తలచుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు.. ఇది తెలంగాణ ప్రజల గొంతుక అని కేటీఆర్ స్పష్టం చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష.. కేసీఆర్ నాయకత్వం, గులాబీ జెండానే తెలంగాణకు రక్షణ. ఈ పార్టీ మరో 75 ఏండ్ల పాటు ఒక డీఎంకే లాగా, శిరోమణి అకాలీదళ్ లాగా ఉంటది. ఈ పార్టీ మన తెలంగాణ ప్రజలది అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో మనం జాగ్రత్తగా ఉండాలి. కాంగ్రెస్‌నే శత్రువుగా చూడాల్సిన అవసరం లేదు. తెలంగాణ సమాజానికి మరింత డేంజరస్ పార్టీ బీజేపీనే. మతాలను అడ్డంపెట్టుకుని, మతపరమైన రాజకీయాలు చేస్తూ.. దేవుడిని అడ్డుపెంట్టుకుని పిల్లలను రెచ్చగొడుతున్నారు. తెలంగాణకు చేసిందేమీ లేదు బీజేపీ. ఐఐటీ, ఐఐఎం, మెడికల్, నర్సింగ్ కాలేజీ ఇవ్వలేదు. ఆఖరికి ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వలేదు. తెలంగాణకు ఏం ఇచ్చారని అడిగితే ఎవరు చెప్పరు.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మాటలు రావు. కానీ పిల్లలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. 32 జిల్లాల్లో పార్టీ ఆఫీసులు ఉన్నాయి. ప్రతి జిల్లాలో బీఆర్ఎస్వీ సమావేశాలు జరగాలి. మండలం, నియోజక వర్గం స్థాయిలో కమిటీలు వేసుకుందాం. సమర్థవంతమైన విద్యార్థి నాయకులు ఉన్నారు. వారిని జిల్లాలకు పంపుదాం. మండల కమిటీ, కాలేజీ కమిటీలను భర్తీ చేసి కొత్త నాయకత్వాన్ని ఎంకరేజ్ చేసుకుందాం. ఎక్కడికక్కడ సోషల్ మీడియాలో క్రియాశీలక పాత్ర పోషించాలి. కేసులకు భయపడొద్దు.. లీగల్ సెల్‌ను బలోపేతం చేస్తున్నాం. విద్యార్థి నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. బీఆర్ఎస్వీ లేని కాలేజీ ఉండొద్దు. విద్యార్థి నాయకులకు రాజకీయంగా అవకాశాలు ఇస్తాం. మున్సిపల్ చైర్మన్లు, జడ్పీ చైర్మన్లు పదవుల్లో అవకాశాలు కల్పిస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.




## మూసీ సుందరీకరణ కాదు.. పునరుజ్జీవం

(మొదటిపేజీ తరువాయి)

మూసీకి ఎంతో చరిత్ర, విశిష్టత ఉంది. మేం చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం. కొందరు మెదడులో మూసీలో ఉన్న మురికికంటే ఎక్కువ విషం నింపుకొన్నారు. మెదడులో విషం నింపుకొని మూసీ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ఈ ప్రభుత్వ ఆలోచన. మల్లన్న సాగర్, వేములఘాట్‌లో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోవాలి. రాత్రికి రాత్రే పోలీసులతో కొట్టించి, గుర్రాలతో తొక్కించి మేం ఖాళీ చేయించటం లేదు. రంగనాయక్‌సాగర్, కొండ పోచమ్మ.. ఇలా ఎక్కడికైనా నేను వస్తా. నేడు మూసీ నది కాలుష్యానికి ప్రతీకగా మారింది. 1600కు పైగా నివాసాలు పూర్తిగా మూసీ నది గర్భంలో ఉన్నాయి. మల్లన్నసాగర్‌లో మునిగిపోయిన 14 గ్రామాల్లో ఎలా వ్యవహరించారో తెలుసా? మేం ఉన్నపళంగా, నిర్దయగా ఎవరినీ ఖాళీ చేయించలేదు. నిర్వాసితులకు రెండుపడక గదుల ఇళ్లు కేటాయించి, రూ.25వేలు ఇచ్చాం. చెరువుల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలనే హైడ్రా కూల్చింది. మూసీ పరివాహకంలో ఎవరి ఇళ్లను హైడ్రా కూల్చలేదు. చినుకు పడితే చాలు హైదరాబాద్‌లో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్లపై పడిన వర్షపు నీరు చెరువుల్లోకి, నదుల్లోకి చేరాలా.. అలాగే రోడ్లపై ఉండాలా?' అని సీఎం ప్రశ్నించారు. అసలు ప్రాజెక్టుకు ఎందుకు చేపట్టారో వివరించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నేతలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. మూసీ సుందరీకరణ అంశంపై వివాదం మరింత చెలరేగుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం మీడియా ముందుకు వచ్చారు. మూసీ వివాదంపై స్పష్టత ఇచ్చారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశిరచే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. 33 బృందాలు మూసీ పరివాహకంపై అధ్యయనం చేశాయని సీఎం తెలిపారు. మూసీ పరివాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని.. అలాంటి వారికి మెరుగైన జీవితం అందించాలని భావిస్తున్నామన్నారు. విద్యావంతుల నుంచి నిరక్ష్యరాస్యుల వరకు అందరికీ హైదరాబాద్ ఉపాధి కల్పించాలన్నారు. గత ప్రధానులు పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి చేశారని.. గత ప్రధానులు సంస్కరణలు తెచ్చిన ప్రతిసారీ కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చిందని సీఎం గుర్తు చేశారు. 10 నెలలుగా అధికారులు నిద్రాహారాలు మాని మూసీపై పనిచేస్తున్నారని సీఎం తెలిపారు. మూసీ నదిలో పేదలు ఎదుర్కొంటున్న కష్టాలను అధికారులు గుర్తించారన్నారు. విప్లవాత్మక నిర్ణయాలను వ్యతిరేకించే వాళ్లు ఎప్పుడూ ఉంటారని అన్నారు. విషవలయంలో పేదలు ఉండాలనేది కొందరి ఆలోచన అంటూ విపక్షాలపై పరోక్షంగా సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. భూగరిష్ట పరిమితి చట్టాన్ని వ్యతిరేకించిన వర్గం కూడా దేశంలో ఉండేదన్నారు. పేదలు ఎప్పుడూ పేదలుగానే ఉండాలని దొరలు, భూస్వాములు భావిస్తారన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు రాష్ట్రాన్ని దోచుకున్నారని సీఎం ఆరోపించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని.. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం అని చెప్పారు. కొందరి మెదడులో మూసీలో ఉన్న మురికి కంటే.. ఎక్కువ విషం నింపుకున్నారంటూ విపక్ష నేతలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విషపూరిత ఆలోచనలతోనే మూసీ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ప్రభుత్వ ఆలోచనగా సీఎం పేర్కొన్నారు. 'మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ అనలేదా? అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు మూసీ ఒడ్డున జీవించాలి. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల 3 నెలలు మూసీ ఒడ్డున ఉండాలి. వాళ్లు 3 నెలలు అక్కడ ఉంటామంటే కావాల్సిన వసతులు కూడా కల్పిస్తాం. ఆ ముగ్గురూ మూడు నెలలు అక్కడ ఉంటే.. ఈ ప్రాజెక్టును ఆ పేస్తాం. మూసీ పరివాహకంలోనే ఉండి ప్రజల కోసం పోరాడాలి, వారి జీవితం బాగుందని నిరూపించాలి. మూసీ ప్రజల కోసం ఏం చేద్దామో అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వాలి. మూసీ పునరుజ్జీవం కోసం మీ వద్ద ఉన్న ప్రణాళిక చెప్పండి. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలి. విపక్ష నేతల సందేహాలు ఏమిటో చెప్పాలి' అని సీఎం ప్రశ్నించారు. మీడియా సమావేశంలో సిఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరలపై పొంతనలేని మాటలు

(మొదటిపేజీ తరువాయి)

అయితే అంతకు మించిన ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించినట్లు భ్రమలు కలిపించే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మహిళలకు ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలు అమలు చేయకుండా, ప్రచారం కోరుకోవడం ముఖ్యమంత్రితో పాటు మంత్రులకు అలవాటుగా మారింది. మహాలక్ష్మి పథకానికి ఈ రాష్ట్రంలోని రేషన్ కార్డు కలిగి ఉన్న 93 లక్షల కుటుంబాలలో 18 ఏళ్లు నిండిన ఒక్క మహిళను అర్హులుగా తీసుకున్నా.. 10 నెలలుగా నెలకు రూ. 2,500 చొప్పున 93 లక్షల మహిళలకు ఒక్కొక్కరికీ రూ. 25,000 వేలు బాకీ పడ్డారు. అంటే మొత్తం రూ. 23,250 కోట్లు. మహాలక్ష్మి అమలు చేయకుండా మోసం చేయడమే కాకుండా రూ. 3,325 కోట్ల లెక్క చెప్పి, చెల్లించాల్సిన రూ. 23,250 కోట్లు కప్పి పుచ్చారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఇది కాకుండా కళ్యాణ లక్ష్మి చెక్కులకు అదనంగా తులం బంగారం ఇస్తామని మాట తప్పారు. రూ.500 గ్యాస్ పథకం, 200 యూనిట్ల గృహజ్యోతిని కొందరికే పరిమితం చేశారు. హామీల అమలు విషయంలో చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత అని విమర్శించారు. ఇక మహిళల గౌరవాన్ని నిలబెడుతున్నట్లు చెప్పిన మీ మాటలు అటుంచితే, మహిళల ప్రాణాలు కాపాడాలని, శాంతి భద్రతలు నిర్వహించి భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## పౌరసత్వ చట్టం సెక్షన్ ఏ రాజ్యాంగబద్ధమే

### సమర్థించిన సుప్రీం ధర్మాసనం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 17 :** పౌరసత్వ చట్టం 1955 లోని సెక్షన్‌ఏ రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోమిశ్రా ధర్మాసనం 4:1 మెజారిటీతో రాజ్యాంగబద్ధతను సమర్థిస్తూ గురువారం తీర్పును వెలువరించింది. అయితే, న్యాయమూర్తుల్లో జస్టిస్ పార్దివాలా మాత్రమే రాజ్యాంగ విరుద్ధమంటూ అభిప్రాయం వ్యక్తం చేశారు. విదేశీయులను భారత పౌరులుగా గుర్తించినా.. పదేళ్ల వరకు ఓటేసే హక్కు ఉండదన్నారు. బంగ్లాదేశ్ నుంచి శరణార్థుల రాక అసోం జనాభా సమతౌల్యతను తీవ్రంగా ప్రభావితం చేసిదంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎ రాష్ట్రంలోని అసలైన నివాసితుల రాజకీయ, సాంస్కృతిక హక్కులను ఉల్లంఘిం చిందని పిటిషన్లు ఆరోపించారు. విచారణ సందర్భంగా సీజేఐ డీవై చంద్రచూడ్ మాట్లాడు తూ అక్రమ వలసలకు అసోం అకార్డ్ రాజకీ య పరిష్కారమని.. సెక్షన్-6ఎ అనేది చట్టబ ద్ధమైన మార్గమని పేర్కొన్నారు. నిబంధనలు రూపొందించేందుకు మెజార్టీతో కూడిన పార్ల మెంట్‌కు ఆ శక్తి ఉందన్నారు. మానవీయ ఆందోళనలను పరిష్కరించడంతో పాటు స్థానికుల ప్రయోజనాలను కాపాడే సమతౌల్యత సెక్షన్‌కు ఉందని.. ఇందులో కటాఫ్ డేట్‌గా నిర్ణయించిన 1971 మార్చి 25 అనేది సరైనదే నన్నారు. ఎందుకంటే అప్పటికే బంగ్లాదేశ్ యుద్ధం ముగిసిందని. బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలోనే ఈ సెక్షన్ తీసుకొచ్చిన విషయా న్ని చెబుతోందని.. ఈ సెక్షన్ అంత ఎక్కువగా జనాభాను కలుపుకోలేదని.. మరీ తక్కువగాను విలీనం చేసుకోలేదని సీజేఐ వ్యాఖ్యానించారు. పౌరసత్వ చట్టం 1955 సెక్షన్6ఎ మేరకు 1966 జనవరి నుంచి 1971 మార్చి 25లోపు అసోంకు వచ్చిన వలసదారులు పౌరసత్వం కోరవచ్చు. ఈ రూల్‌ని 1985లో అసోం అకార్డ్ తర్వాత తీసుకువచ్చారు. అసోంలోకి బంగ్లాదేశ్ వలసలపై ఉద్యమించినవారితో కేంద్రప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ఇది. దీని చట్టబద్ధతపై అసోంలోని కొన్ని స్థానిక గ్రూపులు సుప్రీంకోర్టులో సవాల్ చేశాయి. రాజ్యాంగ పీఠికకు విరుద్ధమని, పౌరహక్కుల ఉల్లంఘనతో పాటు రాజకీయ హక్కులను హరించడమేనని ఆయా గ్రూపులు వాదించాయి.

## పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు, సచివాలయం నుంచి డీజీపీ జితేందర్, కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, ఎస్పీడీసీఎల్ ఎండీ ముష్రాఫ్ అలీ, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ .. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు సీఎస్ శాంతి కుమారి. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతుండడంతో.. పరీక్షల నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ కూడా సవాలుతో కూడుకుంటున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏవిధమైన అపోహలు, పుకార్లకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని మహేందర్ రెడ్డి సూచించారు.



## రాష్ట్ర ఆర్థిక స్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం కృషి

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**సిరిసిల్ల:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు, కిస్తీలు కడుతోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం లింగంపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్లు అప్పుచేసిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఆ అప్పులే గుదిబండలా మారయని తెలిపారు. పదేళ్లుగా విధ్వంసమైన ఆర్థిక స్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో పెడుతుందని చెప్పారు. అప్పులు తీర్చడంతో పాటు పది నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ, రైతు భరోసా, చేయూత, ఎల్పీజీ సబ్సిడీ, మహాలక్ష్మి, గృహజ్యోతి, విద్యుత్ సబ్సిడీ, బియ్యం సబ్సిడీ, ఆర్టీసీ, కళ్యాణలక్ష్మి పథకాలకు భారీగా నిధులు ఖర్చు చేసిందని తెలిపారు. గతంతో పోలిస్తే అప్పులు తగ్గుముఖం పట్టడం శుభసూచకమని, అప్పులను నియంత్రించటంలో రాష్ట్ర ప్రభుత్వం విజయం సాధించిందని తెలిపారు.

## బతుకమ్మ చీరలపై పొంతనలేని మాటలు

(మొదటిపేజీ తరువాయి)

సమాధానం చెప్పకుండా మంత్రి సీతక్క పొంతన లేని వ్యాఖ్యలు చేయడం శోచనీయం అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మా ప్రభుత్వం ఏటా రూ. 300 కోట్లతో బతుకమ్మ చీరెలు పంపిణీ చేసిందని ఒప్పుకున్నందుకు ముందుగా మీకు ధన్యవాదా లు అని సీతక్కను ఉద్దేశించి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అయితే అంతకు మించిన ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించినట్లు భ్రమలు కలిపించే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. హామీల అమలు విషయంలో చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత అని విమర్శించారు. ఇక మహిళల గౌరవాన్ని నిలబెడుతున్నట్లు చెప్పిన మీ మాటలు అటుంచితే, ముందు మహిళల ప్రాణాలు కాపాడాలని, శాంతి భద్రతలు నిర్వహించి వారి భద్రతకు భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
18 అక్టోబర్
2024






# పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలి!

తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేరుస్తామని అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుకు తగ్గట్లుగా అడుగులు వేయాలి. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న ఆకాంక్షలు త్వరగా నెరవేర్చాలి. ఇదే సందర్భంలో ఇక ఉచిత పథకాలను దరిచేరకుండా పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవాలి. రైతుబంధు, రైతు రుణమాఫీలు,రూపాయికి కిలోబియ్యం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు చెక్ పెట్టాలి. పంటలను పూర్తి స్థాయిలో గిట్టుబాటు ధరలకు కొనడమే రైతులను ఆదుకోవడం అవుతుంది. వారికి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం, పంటరుణాలను అందించడం,నీట వసతి కల్పించడం ప్రధాన ఎజెండా కావాలి. ఇవన్నీ కల్పించి పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల్లో ఆదుకునేలా ఉండాలి. చిన్ననీటి వనరులను అభివృద్ధి చేయాలి. ఇలా చేస్తే వ్యవసాయంతో పాటు, అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఇవి చేయకుండా నేలవిడిచి సాము చేయడం సరికాదు. అలాగే విద్యావైద్య రంగాలను కూడా గ్రామస్థాయి లో పటిష్టం చేయాలి. సాగు,తాగునీటి వనరులతో పాటు, పంటలు పండే భూములకు ఇక్కడ కొదువలేదు. పనిచేయడానికి జనం ఉన్నారు. వీటి ఎలా ఉపయోగించాలన్నది నేతల సమర్థత మీద ఆధారపడి ఉంది. పథకాలు, పందేరాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం అసాధ్యం అని గుర్తించాలి. అలాగే గత కెసిఆర్ ప్రభుత్వంలా అభూతకల్పనలు,భ్రమలు కల్పించడం మానుకోవాలి.అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయి. పంచాయితీలను పటిష్టం చేసి వాటి ద్వారానే గ్రామాల పురోభివృద్ధికి పాటుపడాలి. రాజ్యాంగం ఇచ్చి అధికారాలను పంచాయితీలకు దఖలు పర్చాలి. తెలంగాణ ప్రజల బతుకులు మారాలన్న ఏకైక లక్ష్యంతో పోరాటం చేసి సాకారం చేసుకున్న ప్రత్యేక తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తి అయ్యాయి. నిజానికి ఇలాంటి చిన్న రాష్ట్రంలో అన్ని వనరులు ఉన్నా ప్రజల ఆకాంక్షలు తీరలేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పదేళ్లు కల్వంకుంట్ల కుటుంబం రాజభోగాలు అనుభవించింది. గడీల పాలన అందించింది. దీనిని నిందిస్తూ కాలయాపన చేయకుండా రేవంత్ సర్కార్ ముందుకు సాగాలి. అలాగే ఈ పదేళ్లలో తెలంగాణలో ఎవరి బతుకులు మారాయన్నది గమనిస్తే.. రాజకీయ పార్టీల్లో కొందరి బతుకులు మారాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో ప్రజల బతుకులు అలాగే ఉన్నాయి. ఈ క్రమంలో పదేళ్ల పాలనపైనా, ప్రజల జీవన చిత్రంపైనా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. రేవంత్ ప్రభుత్వం గత విధ్వంసాలను గుర్తించి ముందుకు సాగాలి. ప్రజలు ఏం కోరుకుంటున్నారో చర్చించాలి. మూసపద్ధతిలో కాకుండా నిర్మాణాత్మక వైఖరితో ముందుకు సాగితే సింగపూర్, మలేషియా లాంటి చిన్నచిన్న దేశాలను అధిమించవచ్చు. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న నినాదంలో ఏవీ సాకారం కాలేదు. గత ప్రభుత్వ తప్పిదాలను సమీక్షిం చుకుని ప్రజలు కోరుకుంటున్న విధంగా పాలన సాగించాలే కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేయాలి. లేకుంటే..రాజకీయాల్లో ప్రజలు తమదైన రీతిలో బుద్ధి చెబుతారని గుర్తించాలి. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరవాత తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లోనూ.. పథకాలను అమలు చేయడంలోనూ.. అంతకు మించిన స్వార్థ ప్రణాళికతో కెసిఆర్ తొమ్మిదిన్నరేళ్లు పాలించారు. అందుకే ఆయన రాజకీయ జీవితం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా అప్రతిహతంగా కొనసాగింది. కానీ ప్రజలనే వారు ఎల్లవేళలా దేగకళ్లు పెట్టుకుని చూస్తుంటారని గమనించలేదు. ఇవాళ తెలంగాణ అమరవీరుల కోసం కన్నీరు కారుస్తానంటే ప్రజలు నమ్మరు. తవ్వినకొద్దీ అవినీతి పుట్టలు బయటపడుతున్నాయి. ఒక్కో పథకం తవ్వేకొద్దీ అవినీతే తప్ప ప్రజలకు మేలు చేసిన ఆనవాళ్లు కానరావడం లేదు. కాళేశ్వరంతో పాటు అనేక ప్రాజెక్టులను కట్టినట్లు చెప్పి అవినీతిని పారించారు. చెరువులను పునరుద్ధరించి గొలుసుకట్టు చెరువులకు ప్రాణం పోసామని డొల్ల మాటలు ప్రచారం చేశారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేసామని బుకాయించారు. హరితహారంతో పచ్చదనాన్ని పెంచామని చెప్పి పచ్చి అబద్ధాలు చెప్పారు. అన్ని పథకాల్లో అవినీతి దాగివుందన్న సత్యం బయటకు రావడంతో ప్రజలతో పాటు ప్రపంచం కూడా విస్తుపోయింది.ప్రజలకు ఆదర్శ నేతగా నిలవాల్సిన కెసిఆర్ కేవలం తన కుటుంబం, తన బంధువుల కోసం స్వార్థ రాజకీయాలు చేసారని చెప్పడంలో సందేహం లేదు. ఓ రకంగా చెప్పాలంటే పదేళ్ల కెసిఆర్ పాలన అంతా గోబెల్స్ ప్రచారంతో సాగింది. ఇప్పుడు అధికారం కోల్పోవడంతో అదే పనిలో బిఆర్ఎస్ నేతలు ఉన్నారు. నిత్యం ఏదో ఒక ఆరోపణతో తమ గత పాపాలను బయటకు రాకుండా చూస్తున్నారు.తెలంగాణలో కెసిఆర్‌ను మించిన విజినరీ నేత లేదని అప్పుడూ, ఇప్పుడూ భ్రమింప చేస్తున్నారు. కరిమింగిన వెలగ పండులా ఆయన విజినరీ అంతా లోపాలపుట్ట అని తేలింది. అనేక ఆశలు,ఆశయాలతో, అమరుల త్యాగాల తో పురుడుపోసుకున్న తెలంగాణను అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నా, స్వార్థమనే పథకంలో కొట్టుకు పోయాయి. ఈ క్రమంలో పదినెలల రేవంత్ ప్రభుత్వం ఆర్భాటాలకు, అనవసర ఖర్చుల కు, ఉచిత పథకాల జోలికి పోకుండా క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి సారించాలి. తెలంగాణ అభివృద్ధిని మళ్లీ పట్టాలకు ఎక్కించాలి. తాము ఇచ్చిన గ్యారెంటీల పేరుతో కాలక్షేపం చేయకుండా గ్రామస్థాయిలో సమస్యలను ఆకళింపు చేసుకోవాలి. గ్రామాలను బలోపేతం చేసి అభివృద్ధి చేయాలి. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవ నినాదాలతో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చామన్న ఘనత సాధించాలి. ఉద్యోగాల కల్పన, గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, వ్యవసాయాన్ని బలోపతేం చేయడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగించాలి.

# జనగామలో పత్తి కొనుగోళ్లు షురూ

**నాణ్యతా ప్రమాణాలు పాటించాలి**

**రైతుల కొరకు ప్రత్యేక వాట్సాప్ నెంబర్ 8897281111**

**జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా**





జనగామ, అక్టోబర్ 17: (రోమింగ్ న్యూస్) జనగామ జిల్లాలో నేటి నుండి అనగా శుక్రవారం 18వ తేదీ నుండి పత్తి కొనుగోలు ప్రారంభం జరుగుతుందని తెలంగాణ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా తెలిపారు. దీనికి సంబంధించి గురువారం మినీ కాన్ఫరెన్స్ హల్ లో కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగామ జిల్లా వ్యాప్తంగా 1,25,925 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, 1,00,740.55 టన్నుల దిగుబడి అంచనా వేయడం జరిగిందని.... ఇందుకు తగ్గట్టు గా సజావుగా కొనుగోలు జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. పత్తి కొనుగోలు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 10 జిన్నింగ్ మిల్లలలో తేదీ 18.10.2024 నుండి, సి.సి.ఐ. ద్వారా ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం గా కొనుగోలు ప్రారంభమవుతుందన్నారు. రైతులందరూ 8 శాతానికి పత్తి తేమ ఉండేలాగా చూసుకొని.. తీసుకువచ్చి మద్దతు ధర రూ. 7,521/- పొందాలని తెలియజేశారు. 8 శాతం నుండి తేమ శాతం పెరిగిన ప్రతి ఒక్క శాతానికి ఒక శాతం చొప్పున ధర తగ్గుతుందని... రైతులు ఈ విషయాన్ని గమనించి సరైన తేమ శాతంతో పత్తిని తీసుకుని వచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఈసారి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన వాట్సాప్ చాట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. 88972 81111 నెంబర్ ను మొబైల్లో సేవ్ చేసుకొని హాయ్ అని టైప్ చేయడం ద్వారా కాటన్ అమ్మకం, అర్హత, తక్పట్టి వివరాలు, చెల్లింపు స్థితి, సీసీఐ సెంటర్లో వేచి ఉండే సమయం వంటి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. సీసీఐకి పత్తి అమ్ముకోవాలంటే ఆధార్ ప్రామాణికత అనేది తప్పనిసరి అని...ఆధార్ ప్రామాణికత ఉండే విధంగా ముందుగానే సరిచూసుకొని రావాలన్నారు వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ తగిన సూచనలు చేస్తూ పలు విధాలుగా తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశించారు. జిన్నింగ్ మిల్లులలో రైతులకు కనీస మౌలిక వసతులైన తాగునీరు, నీడ వంటి సదుపాయాలను కచ్చితంగా కల్పించాలని ఆదేశించారు. జిన్నింగ్ మిల్లులలో కొనుగోలు జరిపేటప్పుడు టోకెన్ సిస్టం అమలు చేసి క్రమబద్ధీకరించాలని కలెక్టర్ తెలిపారు ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయక్, ఎలక్ట్రిసిటీ ఎస్ ఈ వేణు మాధవ్, జిల్లా రవాణా శాఖ అధికారి ఖలీల్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీరాములు, సీసీఐ అధికారులు నర్సి రెడ్డి, తిరుపతి రెడ్డి, సెక్రటరీ లు, జీన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు

# మరో రైలు ప్రమాదం

**అసోంలో పట్టాలు తప్పిన లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్**

**ప్రాణాపాయం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు**

**ఉన్నతస్థాయి దర్యప్తునకు ఆదేశాలు**

గౌహతి,అక్టోబర్17 : వరుస రైలు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అస్సాంలోని దిమా హసావో జిల్లాలో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. అగర్తలా నుంచి ముంబయికి బయల్దేరిన ఈ రైలు ఇంజిన్‌తో పాటు ఎనిమిది బోగీలు పట్టాలు తప్పాయి. అస్సాంలోని దిబలోంగ్ స్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదని రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ మధ్యాహ్నం 3.55 గంటలకు జరిగిన ఈ రైలు ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. పవర్ కార్, ఇంజిన్‌తో పాటు ఎనిమిది కోచ్‌లు పట్టాలు తప్పాయన్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందగానే.. సహాయక బృందాలు చేరుకున్నాయని తెలిపారు. ఈ ఘటనతో లుమ్‌డింగ్–బాదర్‌పూర్ సింగిల్–లైన్ హిల్ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలు నిలిపివేసినట్లు వెల్లడించారు.

ఈ ప్రమాదం గురువారం మధ్యాహ్నం 3.55 గంటలకు జరిగింది. అగర్తల, ముంబైలోని లోకమాన్య తిలక్ టెర్మినస్ మధ్య నడుస్తున్న రైలు డిబాలాంగ్ స్టేషన్ గుండా వెళుతుండగా పట్టాలు తప్పింది. అయితే పట్టాలు తప్పిన నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగి విచారణ చేస్తున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న తరువాత అసోం సీఎం హిమంత విశ్వ శర్మ కూడా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రయాణికులకు పెద్దగా నష్టం జరగలేదని, ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారని అన్నారు. ఈ క్రమంలో తాను రైల్వే అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదానికి ముందు అగర్తల–లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ గురువారం ఉదయం బయలుదేరింది. ఈ ఘటన నేపథ్యంలో రైల్వే అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపడుతున్నారు. దీంతో లుమ్డింగ్ బదర్‌పూర్ సింగిల్ లైన్ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. ఈ క్రమంలో ప్రజలు సహాయం, అదనపు సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్లు 03674 263120, 03674 263126లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. అయితే అసలు రైలు పట్టాలు తప్పడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# షాంఘై సదస్సుకు మోడీ హాజరై ఉంటే బాగుండేది

**మాజీ పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్**



లాహోర్,అక్టోబర్ 17 : పాకిస్థాన్ లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ పాల్గొనడంపై పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ స్పందించారు. ఇది సానుకూల పరిణామమన్నారు. ఈ సదస్సుకు ప్రధాని మోదీ వస్తే మరింత సంతోషించేవాడినన్నారు. భారత్‌కు చెందిన ఓ జాతీయ వార్తా ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన .. ఇరుదేశాలు గతాన్ని పక్కన పెట్టి.., ఇంధనం, వాతావరణ మార్పుల వంటి భవిష్యత్తు సవాళ్లను పరిష్కరించుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఎస్‌సీవో సదస్సు కోసం పాకిస్థాన్ వెళ్లిన భారత జర్నలిస్టులతో నవాజ్ షరీఫ్, ఆయన కుమార్తె మరియం నవాజ్ లు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. లాహోర్‌లోని ఆయన నివాసంలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత విదేశాంగ మంత్రి జైశంకర్ పాకిస్థాన్‌లో పర్యటించడం తొలి అడుగుగా అభివర్ణించారు. ఇదిలాఉంటే, భారత జర్నలిస్టులతో షరీఫ్ ప్రత్యేకంగా సమావేశం కావడంపై కొన్ని పాక్ మీడియా సంస్థలు భిన్నంగా స్పందించాయి. తమ జర్నలిస్టులకూ అలాంటి అదృష్టం వస్తే బాగుండేదని పేర్కొనడం గమనార్హం.

# అయినను పోయిరావలెను హస్తినకు..

**రేవంత్ ఢిల్లీ పర్యటనలపై కెటిఆర్ సెటైర్లు**

హైదరాబాద్,అక్టోబర్17 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా కామెంట్స్ చేశారు. పైసా పనిలేదు–రాష్ట్రానికి రూపాయి లాభం లేదు.. 10నెలలు – 25 సార్లు – 50 రోజులు.. పోను 25 సార్లు, రాను 25 సార్లు, నీ ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేసి సిల్వర్ జూబ్లీ కూడా చేస్తివి. తట్టా మట్టి తీసింది లేదు.. కొత్తగా చేసింది అసలే లేదు.. అయినను పోయి రావాలె హస్తినకు.. అంటూ ఎద్దేవా చేశారు. అన్నదాతల అరిగోసలు.. గాల్లో దీపాల్లా గురుకులాలు.. కుంటుపడ్డ వైద్యం.. గాడి తప్పిన విద్యా వ్యవస్థ.. అయినను పోయి రావాలె హస్తినకు.. మూసి పేరుతో – హైడ్రా పేరుతో పేదోళ్ల పొట్టలు కొట్టి – 420 హామీలను మడతపెట్టి మూలకు వేసి.. అయినను పోయి రావాలె హస్తినకు.. పండగలు పండగల్లా లేవు.. ఆడబిడ్డల చీరలు అందనేలేవు.. అవ్వా తాతలు అనుకున్న పింఛను లేదు.. తులం బంగారం జాడనే లేదు.. స్కూటీలు లేవు.. కుట్టు మిషిన్లు లేవు.. అయినను పోయి రావాలె హస్తినకు‘ అంటూ కేటీఆర్ విమర్శలు చేశారు. కాగా పేదల ఇళ్లు కూల్చి.. బిల్డర్లు, వ్యాపారవేత్తలను భయపెట్టి డబ్బు వసూళ్ల కోసమే రేవంత్ సర్కార్ హైడ్రా తెచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. పేదలకు తాము అండగా ఉంటామని, క్షేత్రస్థాయిలో పర్యటించి.. బస్తీలు, కాలనీల్లోని వారి భరోసా కల్పిస్తామన్నారు. ఊాష్ట్రం దివాలా తీసిందని ప్రచారం చేస్తూ.. తెలంగాణ పట్ల అందరూ నమ్మకం కోల్పోయేలా.. రేవంత్‌రెడ్డి అసమర్థ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. దిక్కుమాలిన పాలనవల్ల హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందన్నారు. లక్షన్నర కోట్లతో చేపడుతున్న మూసీ సుందరీకరణ వెనుక భారీ కుంభకోణం ఉందని, దానికోసం నిధులు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు.

# మహిళ మీద కన్నేసి బాలిక హత్య

## సూరారం బాలిక మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

మేడ్చల్,అక్టోబర్17 : సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో దసరా పండుగ రోజు జరిగిన దారుణ ఘటనపై పోలీసులు కూపీ లాగి ఛేదించారు. అదృశ్యమైన ఏడేళ్ల చిన్నారి చివరికి ఓ సంచిలో మృతదేహమై కనిపించడంతో కేసు విషాదాంతమైంది. ఈ కేసును మేడ్చల్ జిల్లా సూరారం పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా, అసలు విషయం వెలుగుచూసింది. వివాహిత మీద కన్నేసిన నిందితుడు ఆమె కుమార్తెను హత్య చేశాడు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం పాటగూడ గ్రామానికి చెందిన మిశ్రమ్ ప్రభాకర్ (40) ఏడు నెలల క్రితం హైదరాబాద్ వచ్చాడు. ఇద్దరు కుమార్తెలు ఉన్న గ్రామానికే చెందిన మహిళతో కలిసి కుత్బుల్లాపూర్ పరిధి సూరారం జీవన్ జ్యోతినగర్ లో ఉంటున్నాడు. కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మహిళకు ఇద్దరు కూతుళ్లు కాగా, పెద్ద కూతురు జోష్న వయసు ఏడేళ్లు. ఈ క్రమంలో ప్రభాకర్‌కు ఆ ప్రాంతానికే చెందిన తిరుపతి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ప్రభాకర్ తన ఇంట్లోనే తిరుపతితో కలిసి తరుచూ మద్యం సేవించేవాడు. ఆ క్రమంలో ప్రభాకర్ ఇంట్లో ఉన్న మహిళపై తిరుపతి కన్నేశాడు. ఇద్దరు పిల్లలు, ప్రభాకర్ అడ్డు తొలగించుకుంటే ఆ వివాహితను తన సొంతం చేసుకోవాలని భావించాడు. తన ప్లాన్ ప్రకారం అక్టోబర్ 12న ఉదయం వివాహిత పెద్ద కుమార్తె (7)ను తన ఇంటికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం తిరుపతి ఆ బాలికను తిరిగి తీసుకొచ్చి ప్రభాకర్ ఇంట్లో వదిలేశాడు. సాయంత్రం మరోసారి ప్రభాకర్ ఇంటికి వచ్చి చూడగా, ఎవరూ లేరని తెలుసుకున్నాడు. దాంతో బాలికకు మరోసారి మాయ మాటలు చెప్పి బైకు మీద తీసుకెళ్లాడు. అయితే రాత్రి అయినా బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో ప్రభాకర్, మహిళ కలిసి సూరారం పోలీసులను ఆశ్రయించారు. బాలిక అదృశ్యమైందని ఫిర్యాదు చేసి వివరాలు ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రత్యేక బృందాలతో బాలిక ఆచూకీ కోసం గాలించారు. ఈ క్రమంలో మేడ్చల్ పోలిస్‌స్టేషన్ పరిధి బాసరేగడి గ్రామం సమీపంలో ఓ సంచిలో బాలిక మృతదేహం కనిపించింది. ఆ డెడ్ బాడీ అదృశ్యమైన చిన్నారిదేనని నిర్ధారించారు. బాలిక కనిపించకుండా పోయిన తరువాత నుంచి తిరుపతి జాడ లేకపోవడంతో పోలీసుల ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టారు. బాలికను బైకు మీద తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల ద్వారా ద్వారా గుర్తించిన పోలీసులు మంగళవారం నిందితుడు తిరుపతిని అరెస్ట్ చేశారు.నిందుతుడు తిరుపతిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. చిన్నారిని బైకు మీద తీసుకెళ్లిన తిరుపతి బాసరగడి గ్రామం దగ్గర కత్తితో చిన్నారి గొంతు కోశాడు. కడుపుతో సైతం కత్తితో పొడిచి బాలికను చంపినట్లు నిందితుడు తిరుపతి అంగీకరించాడు. బాలిక మృతదేహాన్ని ఓ సంచిలో మూటకట్టి సమీపంలోని అటవీ ప్రాంతంలో విసిరేసి పారిపోయినట్లు తెలిపాడు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
18 అక్టోబర్
2024






# అట్టహాసంగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణం

## హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, చంద్రబాబు

**చండీగఢ్, అక్టోబర్ 17 :** హర్యాన ముఖ్యమంత్రి గా నాయబ్ సింగ్ సైనీ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 90 అసెంబ్లీ స్థానాలకు గానూ 48 చోట్ల బీజేపీ గెలుపొందింది. గవర్నర్ బండారు దత్తాత్రేయ.. నాయబ్ సింగ్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ , ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. సీఎంతోపాటు అనిల్ విజ్, క్రిషన్ లాల్ పన్వార్, రావ్ నర్బీర్ సింగ్, మహిపాల్ ధండా, విపుల్ గోయెల్, అరవింద్ కుమార్ శర్మ, శ్యామ్ సింగ్ రాణా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక్కడ సీఎం సహా 14 మంది మంత్రులు ఉండే అవకాశం ఉంది. సైనీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగియడంతో పంచ్‌కులాలో ప్రధాని మోదీ అధ్యక్షతన ఎన్డీయే విస్తృత సమావేశం జరిగింది. దీనికి పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. జమిలి ఎన్నికలు, జనగణన, ఉమ్మడి పౌర స్మృతి తదితర కీలక అంశాలపై ఈ భేటీలో చర్చించే అవకాశాలున్నాయి. బీజేపీకి, ఎన్డీయే పార్టీలకూ మధ్య సమన్వయానికి ఒక కమిటీ ఏర్పాటు చేయవచ్చని, ఇదే సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబుకు కీలక బాధ్యతలు అప్పగించవచ్చని చర్చ జరుగుతోంది. రాష్ట్రంలోని 90 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ 48, కాంగ్రెస్ 37 సీట్లలో గెలుపొందాయి. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ హరియాణాలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అంచనా వేసింది. 90 స్థానాల్లో 67.9 శాతం పోలింగ్ నమోదైంది. గెలుపొందిన సీనియర్ నేతల్లో నయాబ్ సింగ్ సైనీతో పాటు, కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హుడా, ఃఏఖ నేత అనిల్ విజ్ (అంబలా కాంట్), శ్రుతి చౌదరి (తోషమ్), ఎఔఒఆ అర్జున్ చౌతాలా తదితరులు ఉన్నారు.

# మూసీపై నేడు బిఆర్ఎస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

## భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

**హైదరాబాద్, అక్టోబర్ 17 :** సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. మూసీపై శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తానని తెలిపారు. మూసీపై భారాస ప్రభుత్వం చేపట్టిన పనులు, మూసీ పునరుజ్జీవనం కోసం చేసిన ప్రయత్నాలు, ప్రణాళికలు వివరిస్తామన్నారు. గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూసీనది అభివృ ద్ధి ప్రాజెక్టు వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. విపక్ష నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవనమని స్పష్టం చేశారు. కొందరు మెదడులో మూసీలో ఉన్న మురికికంటే ఎక్కువ విషం నింపుకొన్నారని, మూసీ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 'మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ అనలేదా? అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు మూసీ ఒడ్డున జీవించాలి. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల 3 నెలలు మూసీ ఒడ్డున ఉండాలి. వాళ్లు 3



నెలలు అక్కడ ఉంటామంటే కావాల్సిన వసతులు కూడా కల్పిస్తాం. ఆ ముగ్గురూ మూడు నెలలు అక్కడ ఉంటే.. ఈ ప్రాజెక్టును ఆ పేస్తాం. మూసీ పరివాహకంలోనే ఉండి ప్రజల కోసం పోరాడాలి, వారి జీవితం బాగుందని నిరూపించాలి' అని సీఎం సవాల్ విసిరారు.

# కొమురం భీమ్ పోరాటమే మనకు రక్ష

## ఆయనే లేకుంటే ఇంత స్వేచ్ఛ దక్కేది కాదు : మంత్రి సీతక్క

**కొమురం భీం, అక్టోబర్ 17 :** ఆదివాసీలకు ఆత్మగౌరవం, అస్తిత్వాన్ని కల్పించిన పోరాట యోధుడు కొమురం భీం అని.. ఆయన లేకపోతే ఇవాళ మనం ఉండకపోయేవాళ్లమని మంత్రి సీతక్క అన్నారు. కెరమెరి మండలం జోడేఘాట్‌లో కొమురం భీం 84వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీతక్క మాట్లాడుతూ.. కొమురం భీం పోరాటంతోనే ఆదివాసీలకు హక్కులు సిద్ధించాయని కొనియాడారు. కొమురం భీం పోరాట స్ఫూర్తితో సాగిన పోరాటం వల్ల తెలంగాణ రాష్ట్రం వచ్చిందని గుర్తు చేశారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ సానుకూలంగా ఉన్నారని సీతక్క తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లక్ష 60 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చామన్నారు. మరోవైపు ఫారెస్ట్ అధికారులకు మంత్రి సీతక్క వార్నింగ్ ఇచ్చారు. పోడు భూముల విషయంలో అత్యుత్సాహం చూపించొద్దని ఫారెస్ట్ అధికారులకు సూచించారు. ప్రజలపై దౌర్జన్యం చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. కొమురం భీం ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామన్న సీతక్క.. ఇక్కడ రోడ్లు, ఇండ్లు, హాస్టల్?ల



అభివృద్ధికి మేము కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల నివేదిక రెడీ చేసి ఇవ్వాలని కలెక్టర్ మంత్రి సీతక్క ఆదేశించారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి జోడే ఘాట్ వస్తారని.. జోడేఘాట్ ప్రాంతంలో టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో కుల గణన జరుగుతోందని.. అధికారులకు మీ సమాచారం ఇవ్వాలని.. సబ్ క్యాస్ట్ చెప్పుకోవాలని ఆదివాసీలకు సూచించారు. ఆడవాళ్ళ జోలికి వస్తే ఎవ్వరిని వదిలిపెట్టేది లేదని.. మేం వెంటే ఉంటామని భరోసా కల్పించారు. ఇది మీ ప్రభుత్వం.. మీ మనుషులమని అన్నారు.

# జివో నెంబర్ 29ని రద్దు చేయాలి

- మళ్లీ ప్రిలిమ్స్ నుంచి పరీక్షల ప్రక్రియ
- పాత జివో ప్రకారమే ఎగ్జామ్ జరపాలని అభ్యర్థన
- పిసిసి చీఫ్, కేటీఆర్‌లతో విడివిడిగా అభ్యర్థుల భేటీ




**హైదరాబాద్, అక్టోబర్ 17 :** తెలంగాణలో గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షల వివాదం ముదురుతోంది. మెయిన్స్ వాయిదా వేయాలంటూ అభ్యర్థుల ఆందోళనతో నగరంలో వాతావరణం హీటెక్కింది. అటు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కీలక నేతలతో అభ్యర్థులతో భేటీ కావడంతో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. గ్రూప-1 అభ్యర్థులు అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ నేతలను కలవడం చర్చనీయాంశంగా మారింది. గాంధీ భవన్ లో గ్రూప్-1 అభ్యర్థులతో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ భేటీ అయ్యారు. గ్రూప్స్ 1 అభ్యర్థుల డిమాండ్లను తెలుసుకున్నారు. జీవో 29 రద్దు చేసి పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు కోరారు. పాత జీవో 55 ప్రకారం పరీక్షల నిర్వహణ జరగాలన్నారు. పాత నోటిఫికేషన్ లో ఇచ్చిన 503 పోస్టలలో కొత్త అభ్యర్థులకు అవకాశం ఇవ్వవద్దన్నారు. పెంచిన 60 పోస్ట్ ల్లో మాత్రమే కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా 503 పోస్ట్ ల్లో60 పోస్టులు పెంచి నోటిఫికేషన్ ఇచ్చింది). జీవో 29 , రిజర్వేషన్ల అంశాల్లో కోర్టు కేసులు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని పరిష్కరించి పరీక్షలు పెట్టాలనిమహేష్‌ను కోరారు. పాత నోటిఫికేషన్ ప్రకారమే రిజర్వేషన్లు, ఓపెన్ క్యాటగిరి ప్రకారం పరీక్షలు ఉండాలని అన్నారు. గ్రూప్స్ 1 అభ్యర్థుల అభ్యర్థన మేరకు ప్రభుత్వానికి సమాచారం అందిస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. సాయంత్రం వరకు దీనిపై తగిన సమాచారం ఇస్తామని క్లారిటీ ఇచ్చారు. మరోవైపు కేటీఆర్ పై పీసీసీ చీఫ్ ఫైర్ అయ్యారు. మీరు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేస్తారా..? అంటూ కేటీఆర్ కు పీసీసీ చీఫ్ సవాల్ విసిరారు. నిరుద్యోగుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని కేటీఆర్ ను విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో నే.. డీఎస్సీ.. వైద్యారోగ్యశాఖ లో ఉద్యోగాలు. గ్రూప్స్.. పోలీసు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మీరు ఏడున్నర లక్షల కోట్ల అప్పు చేసి మిగులు రాష్టాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చేశారని మండిపడ్డారు. ఇకపోతే తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో గ్రూప్ -1 అభ్యర్థులు సమావేశమయ్యారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేసేలా సర్కార్‌పై ఒత్తిడి తేవాలని కేటీఆర్‌కు అభ్యర్థులు విన్నవించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల సమస్యలను కేటీఆర్ విన్నారు. అయితే గ్రూప్-1 మెయిన్స్‌ను రీ షెడ్యూల్ చేయాలని గత కొద్ది రోజుల నుంచి అభ్యర్థులు డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. కానీ కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదు. ఈ నెల 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. ఇదిలా ఉంటే ఈనెల 21 నుంచి జరిగే గ్రూప్-1 మెయిన్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ గత రాత్రి వందలాది మంది అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పలువు అభ్యర్థులు మాట్లాడుతూ జీవో 29, జీవో 55పై ఎటూ తేల్చకుండా, తప్పుడు ప్రశ్నల అంశాన్ని పరిష్కరించకుండా ఆగమేఘాల మీద గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు గ్రూప్-1 పరీక్ష ప్రిలిమ్స్‌లో అన్ని ప్రశ్నలూ తప్పులతడకలేని, 150 ప్రశ్నలకు 20 ప్రశ్నలు తప్పుగా వచ్చాయని గుర్తుచేశారు. ఈ కేసులన్నీ పరిష్కరించిన తర్వాతే మెయిన్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని కెటిఆర్ కు కూడా అభ్యర్థులు వివరించారు. దీనిపై కెటిఆర్ సానుకూలంగా స్పందిస్తూ, దీనిపై న్యాయ సలహా తీసుకుంటామని హామీ ఇచ్చారు.. అభ్యర్థులకు అన్నివిధాల అండగా ఉంటామని కెటిఆర్ హామీ ఇచ్చారు. కాగా, గ్రూప్ 1 మెయిన్స్ రీషెడ్యూల్ చేయాలని అభ్యర్థులు గత కొద్ది రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం సాయంత్రం వందలాది మంది అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగారు. గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్షపై దాదాపు 33 కేసులు వచ్చాయని.. వాటన్నింటినీ పరిష్కరించిన తర్వాతే మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులంతా ఒక్కసారిగా దూసుకురావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న పోలీసులు అభ్యర్థులను అరెస్ట్ చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. అయితే, ఈ వివాదం కొనసాగుతుండగానే ఈ నెల 21 నుంచి షెడ్యూల్ ప్రకారం మెయిన్స్ నిర్వహణకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 14న టీజీపీఎస్సీ హాల్ టికెట్లను విడుదల చేసింది. ఈ క్రమంలోనే గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

# సీఎంఓ అనుమతితోనే హెలికాప్టర్ సేవలు

## రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 17 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించేందుకు రాష్ట్ర మంత్రులు ముఖ్యమంత్రి కార్యాలయ అనుమతితో.. సమయాన్ని ఆదా చేసేందుకు మాత్రమే హెలికాప్టర్ సేవలను ఉపయోగించుకోవడం జరుగుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే తానూ కూడా పలు జిల్లాల్లో ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, సమీక్షా సమావేశాలకు వెళ్లినప్పుడు ముఖ్యమంత్రి కార్యాలయ అనుమతితోనే హెలికాప్టర్ సేవలను వినియోగించుకున్నట్టు తెలిపారు. వరదల సమయంలో కేంద్ర మంత్రుల పర్యటనలకు, సహాయ పునరావాస కార్యక్రమాలకు, గణేష్ నిమజ్జనాన్ని సజావుగా నిర్వహించేందుకు హెలికాప్టర్ సేవలను వినియోగించుకున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. గత నాలుగు నెలల్లో తాను, ఇతర మంత్రులు 7 సార్లు హెలికాప్టర్ సేవలను వినియోగించుకున్నారని కోమటిరెడ్డి తెలియజేశారు. ఇతర మంత్రులతో అధికారిక



సమావేశాలకు వెళ్లేందుకు తనకు గానీ, ఇతర మంత్రులకు గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ హెలికాప్టర్ సేవలను వినియోగించుకునేందుకు ముఖ్యమంత్రి కార్యాలయం అనుమతి నిరాకరించలేదని మంత్రి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# ఘనంగా కొమురం భీమ్ వర్ధంతి

## జోడేఘాట్‌లో నివాళి అర్పించిన గిరిజనులు

**కొమురం భీం, అక్టోబర్ 17 :** భూమికోసం, భుక్తి కోసం, ఆదివాసి హక్కుల కోసం, నిజాం రజాకర్ల నియంతృత్వంపై పోరాడి అమరుడైన మన్యంవీరుడు కొమరం భీంనకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా నివాళులర్పించారు. గురువారం కొమరం భీం జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఐటీడీఏ 84వ వర్ధంతి సభను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కొమురం భీం జిల్లా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులు, ఎంపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొమరం భీం ఆశయాల సాధనకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కొమరం భీమ్ అసువులు బాసిన జోడేఘాట్ లో కొమరం భీమ్ మనవడు సోనేరావు, ఆయన వంశస్థులు ఉదయం నుండే సంప్రదాయ ఆదివాసీ పూజలు నిర్వహించారు. ఆదివాసుల ఆరాధ్య దైవం పెర్సపెన్, గోండు వంశం ఆచారాల మేరకు పూజలు చేశారు. కొమరం భీం పోరాట గాథలను స్మరించుకున్నారు. భీమ్ మృతి చెంది 84 ఏళ్ళు గడుస్తున్నా? పాలకులు కొమరం భీమ్ ఆశయాలను నెరవేర్చడం లేదని అన్నారు. పోడు భూముల పట్టాల కోసం, అడవిలో హక్కు కోసం మరో ఉద్యమాలకు సిద్ధం కావలసి వస్తుందని గిరిజన నేతలు పేర్కొన్నారు. జోడేఘాట్ వర్ధంతి సభ సందర్భంగా ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఖానాపూర్ ఎమ్మెల్యే వేడమ బొజ్జు, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రీ, ఐటీడీఏ పీఓ కుష్బూ గుప్తా, వివిధ పార్టీల నాయకులు గిరిజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

# మూసీలోకి కెమికల్ నీళ్లు రాకుండా చూసుకోవాలి

## ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్, అక్టోబర్ 17 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. మూసీ నదిని ప్రక్షాళన చేయడాన్ని తామేం తప్పుబట్టడం లేదని.. తాము కూడా చేయాలనే కోరుకుంటున్నామని అన్నారు. మూసీలోకి కెమికల్ నీళ్లు రాకుండా చూసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఇప్పుడున్న టెక్నాలజీని వాడి మూసీ నీటిని మంచినీటి మార్చాలని విజ్ఞప్తి చేశారు. అసలు మూసీ సుందరీకరణకు, మూసీ పరివాహక ప్రాంతాల ఇళ్ల కూల్చివేతకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. సకాలంలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని మీరు.. ఇచ్చిన హామీలు అమలు చేయలేని మీరు రూ.లక్షా 50 వేల కోట్లు పెట్టి మూసీని అభివృద్ధి చేస్తారా? అని ఈటల రాజేందర్ విమర్శించారు. మురికినీటికి పరిష్కారం చూపిస్తే ఇళ్లను కూల్చేయాల్సిన పరిస్థితి ఉండదని అన్నారు. ఇదిలా ఉండగా.. అంతకు ముందు మూసీ నదిపై మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. ఈటల రాజేందర్‌కు సవాల్ చేశారు. మూసీ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న కేటీఆర్, హరీష్ రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌లు మూసీ పరివాహక ప్రాంతాల్లో మూడు నెలలు నివాసం ఉండాలని



సూచించారు. అక్కడి పరిస్థితిని అనుభవించాలని చెప్పారు. మూడు నెలలు మీరు అక్కడ ఉండగలిగితే ప్రాజెక్ట్‌ను ఆపేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు స్పందించిన ఈటల రాజేందర్ పై వ్యాఖ్యలు చేశారు.

# ఖాజీల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం

## మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి, అక్టోబర్ 17 :** రాష్ట్రంలో ప్రభుత్వ ఖాజీల సమస్యలన్నింటినీ ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తామని మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. సచివాలయంలో ప్రభుత్వ ఖాజీల ప్రతినిధులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమై న మైనా ర్టీల సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరించేందుకు ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఖాజీలందరూ నైతికతతో న్యాయంగా సేవలందించాలని, చట్ట పరిధిలో పనిచేసి మన్ననలు పొందాలని సూచించారు. ఖాజీల సమస్య లను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఖాజీల ప్రతినిధులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరిస్తూ? ప్రస్తుతం ఒక ప్రభుత్వ ఖాజీ ఉన్నచోట మరొకరిని, లేదా అదనపు ఖాజీని నియమించకూడదన్నారు. గత ప్రభుత్వం ఖాజీల చట్టానికి విరుద్ధంగా నియోజకవర్గానికి ఒకరి కంటే ఎక్కువ సంఖ్యలో ఖాజీలను నియమించిందని చెప్పారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
18 అక్టోబర్
2024








# దేశం గర్వించదగ్గ గిరిజన వీరుడు కుమ్రం భీం

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, అక్టోబర్ 17 :** దేశం గర్వించదగ్గ గిరిజన తిరుగుబాటు వీరుడు, గోండు బెబ్బులి కుమ్రం భీం 84వ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆదివాసీ యోధుడు, అరణ్య సూర్యుడు, పోరాటాల పోతుగడ్డ మీద పుట్టిన అడవి తల్లి ముద్దుబిడ్డ అని చెప్పారు. ఉద్యమ బాటలో, ఉజ్వల ప్రగతి దారిలో జల్.. జంగల్.. జమీన్ నినాదమే స్ఫూర్తిగా కొమురం భీం ఆశయాల అడుగు జాడల్లో పయనించామని తెలిపారు. కొండల్లో కోనల్లో వున్న ప్రతి గూడేనికి, తండాకు స్వచ్ఛమైన మంచినీళ్ల సరఫరాతో విష జ్వరాల చావుల నుంచి విముక్తి కల్పించామని వెల్లడిం చారు. 4 లక్షల ఎకరాలకుపైగా పోడు భూము లపై హక్కులు కల్పిస్తూ.. అడవి బిడ్డలకు పట్టాభిషేకం చేశామని గుర్తుచేశారు. మావనాటే మావరాజ్.. 'మా గూడెంలో మా తండాలో మా రాజ్యం' ఆకాంక్ష స్వరాష్ట్రంలో నెరవేరిందని చెప్పారు. 2,471 గిరిజన పంచాయతీల్లో స్వయం పాలనా జెండా ఎగిరిందని అన్నారు. అవకాశాల్లో జనాభా దామాషా ప్రకారం సముచిత వాటా దక్కేలా గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచుతూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. 188 గురుకుల పాఠశాలలు, 125 గురుకుల ఇంటర్ కాలేజీలు, 22 గురుకుల డిగ్రీ కళాశాలలతో అడవి బిడ్డల విద్యా వికాసానికి నిబద్ధతతో కృషి చేశామని పేర్కొన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ తో విదేశీ చదువుల కలలు సాకారం, గిరిజన యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దిన సీఎంఎస్టీఈఐ స్కీం, ఆ మహనీయుని పేరుతో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాను ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున నిర్మించిన కుమరం భీం ఆదివాసీ భవన్, సేవాలాల్ బంజారా భవన్లు గిరిజన అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయని తెలిపారు. గిరిజన సంస్కృతికి గొప్ప గౌరమైన సమ్మక్క సారక్క జాతర, నాగోబా, జంగుబాయి, చెంచుల బౌలాపూర్, ఎరుకల నాంచారమ్మ, గాంధారి మైసమ్మ, కొలాం పండుగలకు భారీగా నిధులు విడుదల చేశామని, అధికారికంగా నిర్వహించామని వెల్లడించారు. అస్తిత్వ ఉద్యమాలకు, ఆత్మగౌరవ పోరాటాలకు నిత్య ప్రేరణ అందించే రణధీరుడు కుమ్రం భీంకు ఎక్స్ వేదికగా జోహార్లు అర్పించారు.

# మహిళ మీద కన్నేసి బాలిక హత్య


## సూరారం బాలిక మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

**మేడ్చల్, అక్టోబర్ 17 :** సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో దసరా పండుగ రోజు జరిగిన దారుణ ఘటనపై పోలీసులు కూపీ లాగి ఛేదించారు. అదృశ్యమైన ఏడేళ్ల చిన్నారి చివరికి ఓ సంచిలో మృతదేహమై కనిపించడంతో కేసు విషాదాంతమైంది. ఈ కేసును మేడ్చల్ జిల్లా సూరారం పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా, అసలు విషయం వెలుగుచూసింది. వివాహిత మీద కన్నేసిన నిందితుడు ఆమె కుమార్తెను హత్య చేశాడు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం పాటగూడ గ్రామానికి చెందిన మిశ్రమ్ ప్రభాకర్ (40) ఏడు నెలల క్రితం హైదరాబాద్ వచ్చాడు. ఇద్దరు కుమార్తెలు ఉన్న గ్రామానికే చెందిన మహిళతో కలిసి కుత్బుల్లాపూర్ పరిధి సూరారం జీవన్ జ్యోతినగర్ లో ఉంటున్నాడు. కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మహిళకు ఇద్దరు కూతుళ్లు కాగా, పెద్ద కూతురు జోష్న వయసు ఏడేళ్లు. ఈ క్రమంలో ప్రభాకర్ కు ఆ ప్రాంతానికే చెందిన తిరుపతి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ప్రభాకర్ తన ఇంట్లోనే తిరుపతితో కలిసి తరుచూ మద్యం సేవించేవాడు. ఆ క్రమంలో ప్రభాకర్ ఇంట్లో ఉన్న మహిళపై తిరుపతి కన్నేశాడు. ఇద్దరు పిల్లలు, ప్రభాకర్ అడ్డు తొలగించుకుంటే ఆ వివాహితను తన సొంతం చేసుకోవాలని భావించాడు. తన ప్లాన్ ప్రకారం అక్టోబర్ 12న ఉదయం వివాహిత పెద్ద కుమార్తె (7)ను తన ఇంటికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం తిరుపతి ఆ బాలికను తిరిగి తీసుకొచ్చి ప్రభాకర్ ఇంట్లో వదిలేశాడు. సాయంత్రం మరోసారి ప్రభాకర్ ఇంటికి వచ్చి చూడగా, ఎవరూ లేరని తెలుసుకున్నాడు. దాంతో బాలికకు మరోసారి మాయ మాటలు చెప్పి బైకు మీద తీసుకెళ్లాడు. అయితే రాత్రి అయినా బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో ప్రభాకర్, మహిళ కలిసి సూరారం పోలీసులను ఆశ్రయించారు. బాలిక అదృశ్యమైందని ఫిర్యాదు చేసి వివరాలు ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రత్యేక బృందాలతో బాలిక ఆచూకీ కోసం గాలించారు. ఈ క్రమంలో మేడ్చల్ పోలిస్‌స్టేషన్ పరిధి బాసరేగడి గ్రామం సమీపంలో ఓ సంచిలో బాలిక మృతదేహం కనిపించింది. ఆ డెడ్ బాడీ అదృశ్యమైన చిన్నారిదేనని నిర్ధారించారు. బాలిక కనిపించకుండా పోయిన తరువాత నుంచి తిరుపతి జాడ లేకపోవడంతో పోలీసుల ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టారు. బాలికను బైకు మీద తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల ద్వారా ద్వారా గుర్తించిన పోలీసులు మంగళవారం నిందితుడు తిరుపతిని అరెస్ట్ చేశారు. నిందుతుడు తిరుపతిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. చిన్నారిని బైకు మీద తీసుకెళ్లిన తిరుపతి బాసరగడి గ్రామం దగ్గర కత్తితో చిన్నారి గొంతు కోశాడు. కడుపుతో సైతం కత్తితో పొడిచి బాలికను చంపినట్లు నిందితుడు తిరుపతి అంగీకరించాడు. బాలిక మృతదేహాన్ని మూటకట్టి అటవీ ప్రాంతంలో విసిరేసి పారిపోయినట్లు తెలిపాడు.

# రేవంత్‌వి తేనె పూసిన మాటలు

## మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సిందే : మందకృష్ణ మాదిగ హెచ్చరిక

**హైదరాబాద్, అక్టోబర్ 17 :** మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలుచేసే విషయంలో రాష్ట్రం ముందుంటుందని సీఎం అన్నారని గుర్తుచేశారు. కానీ అమలు విషయంలో జాప్యం చేస్తున్నారని చెప్పారు. 'ఎస్సీ వర్గీకరణ అమలులో ఎందుకు జాప్యం చేస్తున్నారు? మాదిగలపై రేవంత్‌వి తేనె పూసిన మాటలు. నమ్మించడంలో ఘనుడు.. మోసం చేయడంలో అంతకన్నా పెద్ద ఘనుడే. వర్గీకరణ అంశంపై సీఎం తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు.



ఎస్సీ వర్గీకరణ విషయంలో పంజాబ్, తమిళనాడు తొలి వరసలో నిలిచాయి. ముందు అమలు చేస్తామన్న రేవంత్ మాటలకు విలువ లేకుండాపోయింది' అని మందకృష్ణ మాదిగ విమర్శించారు.

# మద్యం ధరలపై కన్నేసిన ప్రభుత్వం!

## ధరలు పెంచే యోచనలో సర్కార్

**హైదరాబాద్, అక్టోబర్ 17 :** తెలంగాణలో మద్యం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తోంది. ఈ ఏడాది కూడా మద్యం ద్వారా భారీగా ఆదాయం ఆర్జించాలని తెలంగాణ సర్కార్ భావిస్తోంది. అందులో భాగంగానే మద్యం ధరల పెంపునకు సిద్ధమైనట్లు సమాచారం. మద్యంతో ఎంజాయ్ చేస్తున్న మందుబాబులకు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం పెద్ద షాకే ఇవ్వబోతుంది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం ఆదాయాన్ని అదనంగా మరో రూ.5,318 కోట్లకు పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా బీర్ల ఉత్పత్తి కేంద్రాలకు చెల్లించే ధరలను ప్రభుత్వం ప్రతి రెండేళ్లకొకసారి పెంచుతుంది. అలాగే ఈసారి వివిధ రకాల మద్యంపై రూ. 20 నుంచి రూ. 150 పెంచాలని ప్రభుత్వాన్ని బ్రూవరీలు కోరాయి. ఏటా బతుకమ్మ, దసరా సందర్భంగా రాష్ట్రంలో లిక్కర్ అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. ఈసారి కూడా మందుబాబులు అదే ఒరవడిని కొనసాగిస్తూ భారీ రికార్డు నెలకొల్పారు. కేవలం 10 రోజుల వ్యవధిలో రూ.1,100 కోట్లకుపైగా మందును తాగేశారు. పది రోజుల్లో వెయ్యి కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. బార్లు, మద్యం దుకాణాలతో



పాటుగా పబ్‌లలోనూ అమ్మకాలు పెరిగాయి. దీంతో సర్కార్ ఖజానాకు.. మద్యం భారీగా ఆదాయం తెచ్చి పెట్టింది. మద్యం అమ్మకాల్లో ఎప్పటిలాగే హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 2 వేల 260 మద్యం దుకాణాలు, 1,171బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. వీటితో పాటుగా పబ్బుల్లోనూ మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఏటా దసరా వేళ తెలంగాణలో మద్యం ఎక్కువ మొత్తంలో అమ్ముడవుతుంది. ఈ సారి అదే అంచనాతో ముందుగానే ఎక్సైజ్ శాఖ అధికంగా మద్యం నిల్వలను సిద్ధం చేసుకుంది. ఆర్డర్లు కూడా ఊహించిన దాని కన్నా అధికంగా ఉండటంతో రాష్ట్ర సర్కార్ ఖజానాకు కాసుల వర్షం కురిసింది. బార్లు సైతం తగినంత స్టాక్‌ను అందుబాటులో ఉంచాయి. దసరాకు ముందు నుంచే మొదలైన మద్యం కిక్కు శని, ఆదివారాల్లో పీక్స్‌కు చేరింది. సెప్టెంబర్ 30 వరకు 2 వేల 838 కోట్ల అమ్మకాలు జరగ్గా... అక్టోబర్ నెల ప్రారంభం నుంచి 11వ తేదీ వరకు రూ 1,100 కోట్ల మేర విలువైన 10 లక్షల 44వేల కేసుల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. 10 రోజులవ్యవధిలోనే 17 లక్షల 59 వేల బీర్లు అమ్ముడుపోయాయట. మద్యం అమ్మకాల్లో ఉమ్మడి రంగారెడ్డి టాప్‌లో ఉండగా ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, వరంగల్ జిల్లాలు తర్వాతి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మద్యం అమ్మకాలు ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని సమకూర్చాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 10వ తేదీతో పోలిస్తే ఈ ఏడాది ఇదే సమయంలో పది రోజులకుగానూ అమ్మకాలు కాస్త తగ్గాయి. గ్రేటర్ హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, శంషాబాద్, సరూర్‌నగర్, వికారాబాద్ జిల్లాల పరిధిలో 674 మద్యం దుకాణాలు ఉండగా, 2023లో మద్యం అమ్మకాల ద్వారా రూ.317 కోట్ల 21 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రూ.312 కోట్లే ఖజానాకు వచ్చింది. గతంతో పోల్చితే ఎక్సైజ్ ఆదాయం రూ.5 కోట్ల 18 లక్షలు తగ్గడం గమనార్హం.

# రాడార్ కేంద్రంపైనా రాజకీయమా

## దేశ రక్షణపై ఇంతటి దౌర్భాగ్యపు మాటలా
## కెటిఆర్ తీరుపై మండిపడ్డ సిఎం రేవంత్

**హైదరాబాద్, అక్టోబర్ 17 :** రాడార్ స్టేషన్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందే బీఆర్ఎస్ అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. వాళ్లు దిగిపోయే నాటికి అన్ని పర్మిషన్లు తీసుకున్నారని తెలిపారు. దేశ భద్రతను కూడా రాజకీయాలకు ముడిపెడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. దేశ భద్రతను వ్యతిరేకిస్తే వాడు కసబ్ కంటే హీనుడు అని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. లక్షల ఎకరాలు కాలుష్యం చేయాలని చూసిన వాళ్లు రాడార్ సెంటర్ గురించి మాట్లాడుతున్నారని రేవంత్ ఎద్దేవా చేశారు. దేశ ప్రయోజనాల కోసం పెట్టే ప్రాజెక్టును ఎలా అడ్డుకుంటామని ఆయన ప్రశ్నించారు. 12 లక్షల చెట్లు పోతున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. వందలు, వేలల్లోనే చెట్లు పోతున్నాయని సీఎం చెప్పారు. ఆ చెట్లకు ఐదింతలు మొక్కలు నాటుతారని తెలిపారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రానికి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. దేశంలోనే రెండో వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ స్టేషన్ ను నేవీ ఇక్కడ నెలకొల్పుతోంది. నౌకలు, జలాంతర్గాములతో సంభాషించేందుకు నావికా దళం వీఎల్ఎఫ్ (వెరీ లో ఫ్రీక్వెన్సీ) కమ్యూనికేషన్ ట్రాన్స్ మిషన్ స్టేషన్?ను ఉపయోగిస్తుంది. నేవీ రాడార్?కు సంబంధించి దేశంలోనే ఇది రెండో స్టేషన్. తమిళనాడులోని తిరునెల్వేలిలో ఉన్న ఐఎన్ఎస్ కట్టబొమ్మన్ రాడార్ స్టేషన్ మొదటిది. 1990 నుంచి అది నావికా దళానికి సేవలందిస్తోంది. రెండో రాడార్ స్టేషన్ ఏర్పాటుకు తెలంగాణ అనువైన



ప్రాంతంగా విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్ ఇప్పటికే గుర్తించింది. 2010 నుంచి నావికా దళం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. పర్యావరణ అనుమతులు, క్లియరెన్స్ లు వచ్చినప్పటికీ.. గత ప్రభుత్వం భూముల కేటాయించలేదు. ఈ ఏడాది జనవరిలో కమోడోర్ కార్తీక్ శంకర్, సర్కిల్ డీఈవో రోహిత్ భూపతి, కెప్టెన్ సందీప్ దాస్ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. అనంతరం వికారాబాద్ డీఎఫ్ వో, నావల్ కమాండ్ ఏజెన్సీ అధికారులు అటవీ భూముల బదిలీ ఒప్పందంపై సంతకాలు చేశారు. దామగూడెం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న 1,174 హెక్టార్ల అటవీ భూమిని నేవీకి అప్పగించారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయి.

# రూ.1200 కోట్ల కుంభకోణంపై దర్యాప్తు

## మహిళా ఐపీఎస్‌పై సీబీఐ కేసు నమోదు

**ముంబయి, అక్టోబర్ 17 :** మహారాష్ట్రలోని ఓ మహిళా ఐపీఎస్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. రూ. 1200 కోట్ల కుంభకోణానికి సంబంధించిన దర్యాప్తు వ్యవహారంలో ఆమె ఫోర్జరీ, నేరపూరిత కుట్రకు పాల్పడడమే అందుకు కారణంగా తెలుస్తోంది. ఈ విషయాన్ని సీబీఐ తాజాగా వెల్లడించింది. జల్‌గావ్ జిల్లాలోని భైచంద్ హీరాచంద్ రైసోనీ క్రెడిట్ సొసైటీ ఫిక్సడ్ డిపాజిట్ల పేరుతో అనేకమందిని మోసం చేసింది. రూ. 1200 కోట్లకు పైగా కుంభకోణానికి పాల్పడింది. ఈ కుంభకోణం 2015లో వెలుగులోకి వచ్చింది. ఈ కేసు 2020లో సీబీఐకి బదిలీ అయింది. ఈ వ్యవహారానికి సంబంధించిన కేసులను దర్యాప్తు చేసిన సిట్‌కు ఐపీఎస్ అధికారిణి భాగ్యశ్రీ నవ్‌టకే నేతృత్వం వహించారు. ఈ క్రమంలోనే ఆమె దర్యాప్తులో ఎన్నో అవకతవకలకు పాల్పడినట్లు సీబీఐ పేర్కొంది. ఒకే రోజు ఒక్క నేరం కింద మూడు కేసులు నమోదు చేయడం.. కేసు కోసం హాజరుకాకుండానే ఫిర్యాదుదారుల సంతకాలను ఫోర్జరీ చేయడంలో అధికారిణి ప్రమేయం ఉన్నట్లు సీబీఐ విచారణలో తేలింది. దీంతో ఆమె నేరపూరిత కుట్రకు పాల్పడినట్లుగా దర్యాప్తు సంస్థ ఫిర్యాదులో ప్రస్తావించింది.
ఈ పరిణా మాల నేపథ్యంలో సీబీఐ కేసు నమోదు చేసింది. 2020లో ఈ వ్యవహారానికి సంబంధించి కంపెనీ డైరెక్ట ర్లపై సీబీఐ కేసు నమోదు చేసింది. మరుసటి ఏడాది ప్రధాన నిందితుడు జితేంద్ర కందారేను పుణె పోలీసులు అరెస్టు చేశారు. అతడిపై విచారణ కొనసాగుతోంది.

# 23న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం

**హైదరాబాద్, అక్టోబర్ 17 :** ఈ నెల 23వ తేదీన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సాయంత్రం 4 గంటలకు కేబినెట్ భేటీ జరగనుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. ఈ కేబినెట్ సమావేశంలో పలు అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించనుంది. హైడ్రా ఆర్డినెన్సుకు చట్టబద్ధత, రెవెన్యూ చట్టం, మూసీ బాధితులకు న్యాయం చేసే అంశం, వరద నష్టం, రైతు భరోసా అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయా శాఖల నుంచి వివరాలు సిద్ధం చేయాలని ప్రభుత్వం అధికారు లను ఆదేశించింది. ఈ నెలాఖరున అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సర్కారు ఏర్పాట్లు చేస్తోంది. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో హైడ్రాపై జోరుగా చర్చ సాగుతోంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, చెరువులను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను కూల్చేస్తూ హైడ్రా దూకుడుగా వ్యవహరిస్తోంది. పేదలు ఇళ్లు కోల్పోతున్నారంటూ ప్రతిపక్ష నేతలు హైడ్రాపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. అయినా, ప్రభుత్వం ఈ విషయంపై వెనక్కు తగ్గడం లేదు. అటు, రాజకీయ ప్రకంపనల మధ్యే ప్రభుత్వం తాజాగా హైడ్రాకు మరిన్ని బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ వరకూ ఉన్న 27 పురపాలికల్లో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణకు అవసరమైన అధికారాల ను కట్టబెట్టింది. ఈ ఆదేశాలతో జీహెచ్ఎంసీకి చెందిన రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ బాడీలు, బహిరంగ ప్రదేశాలు, పబ్లిక్ పార్కులు వంటి ఆస్తులను ఆక్రమణకు గురి కాకుండా హైడ్రా రక్షించనుంది. 'జీహెచ్ఎంసీ చట్టం - 1955' కింద అవసరమైన అధికారాలను హైడ్రాకు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

## రాబోయే ఐదురోజులు వానలు కొనసాగుతాయి

**హైదరాబాద్, అక్టోబర్ 17 :** తెలంగాణలో రాబోయే ఐదురోజులు వానలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర కోస్తా, తమిళనాడులో కేంద్రీకృతమైన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితలం ఆవర్తనం కొనసాగుతుందని.. సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి దిశకు వంగి ఉందని పేర్కొంది. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఈ నెల 20 వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. దాని ప్రభావంతో 22 వరకు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని.. ఆ తర్వాత వాయువ దిశగా పయనిస్తూ మరింత బలపడే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని.. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడేందుకు అవకాశాలున్నాయని చెప్పింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలతో పాటు వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, నారాయణపే, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలుపడుతాయని ఐఎండీ అంచనా వేసింది.

# బస్సును వేగంగా ఢీకొన్న బైకు

## ముగ్గురు మృతి

**వికారాబాద్, అక్టోబర్ 17 :** వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందారు. హైదరాబాద్-బీజాపూర్ హైవేపై పూడూరు గేటు వద్ద ఆర్టీసీ బస్సును బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందారు. మృతులను పూడూరు మండలం మేడికొండకు చెందిన వారిగా గుర్తించారు. బస్సు సేడం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన బైకు బస్సును ఢీకొనగడంతో ప్రమాదం జరిగింది.



# కొమురం భీమ్, వాల్మీకిలకు సిఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్, అక్టోబర్ 17 :** కొమురం భీమ్ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. భీమ్ పోరాటాన్ని తలచుకున్నారు. కొమురం భీమ్ చిత్రపటానికి నివాలు అర్పించిన మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తదితరులు కూడా నివాళి అర్పించారు. అలాగే వాల్మీకి జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. వాల్మీకి చిత్రపటానికి నివాలు అర్పించిన వారిలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తదితరులు ఉన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 18 అక్టోబర్ 2024





# షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్

### నవంబర్ 18లోగా హాజరు పర్చాలని కోర్టు ఆదేశం

ఢాకా,అక్టోబర్17 : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పై అరెస్టు వారెంట్ జారీ అయింది. ఆ దేశానికి చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఈ వారెంట్ ఇచ్చింది. నవంబరు 18లోగా ఆమెను అరెస్టు చేసి తమ ఎదుట హాజరు పరచాలని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజుల్ ఇస్లాం తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. తర్వాత నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, ఇతర నేరాల ఆరోపణలపై హసీనాకు వ్యతిరేకంగా ఐసీటీకి 60 ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రిబ్యునల్ ఇటీవల దర్యాప్తు ప్రారంభించింది. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమెను బంగ్లాదేశ్‌కు రప్పిస్తామని, ఆమెపై అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని ఐసీటీ నూతన ప్రాసిక్యూటర్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. హసీనా పాలనపై తీవ్ర నిరసన వ్యక్తంచేసిన విద్యార్థి సంఘాలు ఆమె భారత్‌లో ఉండటాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదిలాఉంటే.. హసీనాను చట్టబద్ధంగా తమ దేశానికి అప్పగించాలంటూ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) భారత ప్రభుత్వాన్ని డిమాండు చేసిన సంగతి తెలిసిందే. మరోపక్క ఆమె దౌత్య పాస్‌పోర్టు రద్దయిన సంగతి తెలిసిందే. హసీనా హయాంలో ఎంపీలకు జారీ చేసిన దౌత్య పాస్‌పోర్టులను రద్దు చేసినట్లు బంగ్లా హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పాస్‌పోర్టు ఉన్నవారు కొన్ని నిర్దిష్ట దేశాలు వీసా లేకుండా ప్రయాణించే వీలు ఉంటుంది. ఆగస్టు 5న పదవి నుంచి దిగిపోయి భారత్‌కు చేరుకున్న తర్వాత బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. ఇదిలా ఉంటే.. హసీనాను బంగ్లాకు రప్పించడానికి యూనస్ ప్రభుత్వం అన్ని యత్నాలు చేస్తుందని ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ గతంలో పేర్కొంది. హసీనాను అప్పగించాలా, వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత భారత్‌పైనే ఉందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు 45 మందిపై బంగ్లాదేశ్ ఇంటర్నేషన్ క్రైమ్ ట్రిబ్యునల్ గురువారం అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. అరెస్టు వారెంట్లు జారీ అయిన వారిలో అవామీ లీగ్‌కు చెందిన పలువురు నాయకులు సైతం ఉన్నారు. విద్యార్థుల ఉద్యమం నేపథ్యంలో జరిగిన మారణహోమం, ఇతర నేరారోపణలపై క్రైమ్ ట్రిబ్యునల్‌లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన రెండు పిటిషన్లపై జస్టిస్ మహ్మద్ గోలం ముర్తాజా మజుందార్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని చీఫ్ ప్రాసిక్యూటర్ మహ్మద్ తాజుల్ ఇస్లాం వెల్లడించారు. నవంబర్ 18లోగా షేక్ హసీనా సహా మొత్తం 46 మందిని అరెస్ట్ చేసి హాజరుపరచాలని ధర్మాసనం అధికారులను ఆదేశించింది. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమం హింసాత్మకంగా సాగిన విషయం తెలిసిందే. ఉద్యమాన్ని అణిచివేసేందుకు షేక్ హసీనా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విద్యార్థి నేతలు ఆరోపించారు. హింసాత్మక ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. నిరసనలు మరింత ఉధృతం కావడంతో షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌కు వచ్చారు. ఆమె ప్రస్తుతం భారత్‌లోనే ఆశ్రయం పొందుతున్నారు. హసీనా రాజీనామా తర్వాత నోబెల్ గ్రహీత, ఆర్థిక వేత్త మొహమ్మద్ యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వం విద్యార్థి ఉద్యమంలో హింసకు పాల్పడిన వారిపై కేసులు నమోదు
చేసి విచారణ జరుపుతున్నది.

# ఎపిలో పెట్టుబడులకు వేట

### 25 నుంచి మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన

### ఐటి సినర్జీ కాన్ఫరెన్స్‌కు హాజరు

అమరావతి,అక్టోబర్17 : ఏపీలో పెట్టుబడులపై ఈ నెల 25 నుంచి మంత్రి నారా లోకేశ్ అమెరికాలో పర్యటించనున్నారు. నవంబర్ ఒకటో తేదీ వరకు శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో లోకేశ్ పర్యటించనున్నారు. ఈ నెల 25 తేదీన అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగే ఐటీ సినర్జీ కాన్ఫరెన్సుకు మంత్రి హాజరు కానున్నారు. ఏపీలో పెట్టుబడులపై ప్రముఖ కంపెనీలతో మంత్రి లోకేశ్ భేటీ కానున్నారు. నారా లోకేష్ వెంట సీఎం అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా, ఏపీఈడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ వెళ్లనున్నారు. అప్పటి వరకూ ఏపీఈడీబీ సీఈఓగా సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి సురేష్ కుమార్‌కు ఆ బాధ్యతలను అప్పగించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు కొత్త పాలసీలతో ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఆహ్వానం పలుకుతున్న సంగతి తెలిసిందే. బెస్ట్ పారిశ్రామిక పాలసీలతో ఏపీ ఇప్పుడు పెట్టుబడులకు సిద్ధంగా ఉందంటూ ముఖ్యమంత్రి ట్వీట్ కూడా చేశారు. ఏపీలో కార్యకలాపాలకు పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ స్వాగతం అంటూ ముఖ్యమంత్రి స్వాగతం పలికారు. సమ–ర్థులైన యువత, స్నేహ పూర్వక ప్రభుత్వం, మౌళిక సదుపాయాలతో పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడులతో మీ వ్యాపారం పెరుగుతుంది.మా రాష్ట్రం వృద్ధి చెందుతుంది అంటూ పారిశ్రామికవేత్తలకు సీఎం ఆహ్వానం పలికారు. ఈ క్రమంలోనే లోకేశ్ అమెరికా పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆయన మంత్రిగా బాధ్యత స్వీకరించిన తర్వాత తొలిసారి అమెరికా పర్యటనకు వెళ్తున్నారు. ఏపీలో పెట్టుబడులను తీసుకుని రావాలని తద్వారా ఏపీలో ఉపాధి కల్పన అవకాశాలను పెంచాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది.

# ఎపిలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం

### పారిశ్రామిక వేత్తలకు సిఎం చంద్రబాబు ఆహ్వానం

### రెడ్ కార్పెట్ స్వాగతం అంటూ ఎక్స్ వేదికగా పోస్ట్


అమరావతి,అక్టోబర్17 : రాష్ట్రంలో పెట్టుబడులకు కొత్త పాలసీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానం పలికారు, బెస్ట్ పారిశ్రామిక పాలసీలతో ఏపీ ఇప్పుడు పెట్టుబడులకు సిద్ధంగా ఉందంటూ ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు. ఏపీలో కార్యకలాపాలకు పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ స్వాగతం అంటూ ముఖ్యమంత్రి స్వాగతం పలికారు. సమ–ర్థులైన యువత, స్నేహ పూర్వక ప్రభుత్వం, మౌళిక సదుపాయాలతో పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడులతో మీ వ్యాపారం పెరుగుతుంది?మా రాష్ట్రం వృద్ధి చెందుతుంది అంటూ పారిశ్రామికవేత్తలకు సీఎం ఆహ్వానం పలికారు. ముఖ్యమంత్రి ట్విట్టర్ పోస్ట్‌లో.. 'పెట్టుబడులు పెట్టేందుకు నేను పారిశ్రామిక వేత్తలకు రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతున్నా. ఏపీలో వ్యాపార అనుకూల ప్రభుత్వం, ప్రతిభావంతులైన యువత, ఉత్తమ మౌలిక సదుపాయాలు పెట్టుబడులకు అనుకూలం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మా ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలతో చర్చించి కొత్త పాలసీలు తెచ్చింది. కొత్త పాలసీలు వేగవంతమైన వ్యాపార నిర్వహణకు దోహదం చేస్తాయి. మేము దేశంలో అత్యుత్తమ వ్యాపార వాతారణ వ్యవస్థను నిర్మిస్తున్నాము. రాష్ట్రంలో మీ వ్యాపారానికి ప్రభుత్వం పూర్తి సహాయసహకారాలు అందిస్తుందని నేను వ్యక్తిగతంగా మీకు హామీ ఇస్తున్నాను. భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ఇంతకంటే మంచి సమయం ఎప్పుడూ లేదు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి పెట్టడానికి కూడా ఇంతకంటే మంచి సమయం ఎప్పుడూ రాదు!. రాష్ట్రంలో పెట్టుబడులతో మీ వ్యాపారం పెరుగుతుంది?.రాష్ట్ర సామర్థ్యం పెరుగుతుంది ఆంధ్రప్రదేశ్‌లో మీ పెట్టుబడుల కోసం మేం ఎదురుచూస్తున్నాం.' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

--------------------

# సుప్రీం తదుపరి చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా

### కేంద్రానికి సిఫార్సు చేసిన సిజెఐ డివై చంద్రచూడ్

న్యూఢిల్లీ,అక్టోబర్17 : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీకాలం నవంబర్ 10తో ముగియనుంది. దాంతో తన తరువాత సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఆయన కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సుప్రీంకోర్టులో చంద్రచూడ్ తర్వాత సీనియర్ జడ్జిగా ఖన్నా ఉన్నారు. జస్టిస్ చంద్రచూడ్ సిఫార్సులను కేంద్రం ఆమోదిస్తే 51వ భారత ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా నియమితులు కానున్నారు. నియమితులైతే 2025 మే 13 వరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవిలో ఉంటారు. 2019లో ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఖన్నా పదోన్నతి పొందారు. నిబంధనల ప్రకారం జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రతిపాదనను కేంద్ర న్యాయశాఖ పరిశీలించి ప్రధానమంత్రికి పంపిస్తుంది. ప్రధాని మోదీ ఆమోదం తరువాత రాష్ట్రపతి వద్దకు వెళుతుంది. రాష్ట్రపతి ఆమోదముద్రతో తదుపరి ప్రధాన న్యాయమూర్తి ఎంపిక ఖరారవుతుంది. 2022 నవంబర్ 9వ తేదీన ఛీఫ్ జస్టిస్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్ ఎక్కువకాలం ఈ పదవిలో ఉన్నారు. సంప్రదాయం ప్రకారం సీజేఐ తన తర్వాత ఆ పదవిని చేపట్టేందుకు అత్యంత సీనియర్ న్యాయమూర్తి పేరును సిఫార్సు చేస్తారు. ఆ లెక్కన జస్టిస్ డివై చంద్రచూడ్ తర్వాత జస్టిస్ ఖన్నా అత్యంత సీనియర్‌గా ఉన్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీలో న్యాయవాదిగా 1983లో



పేరు నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. ఆ తరువాత ఢిల్లీ హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగారు. 2004లో ఇన్‌కంటాక్స్ శాఖకు సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. ఢిల్లీ హైకోర్టులో ఎమికస్ క్యూరీగా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలు అందించారు. ఆ తరువాత 2005లో ఢిల్లీ హైకోర్టు అడిషనల్ జడ్జిగా, 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియామితులయ్యారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ ఛైర్మన్‌గా, ఢిల్లీ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ ఇన్‌ఛార్జిగా కొనసాగారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఏ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందించకుండానే సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఎలక్టోరల్ బాండ్స్, ఆర్టికల్ 370 తొలగింపు, సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్ సంబంధిత కేసుల్లో జస్టిస్ సంజీవ్ ఖన్నా పాత్ర కీలకమైంది. కాగా నవంబరు 11న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ విరమణ చేయనున్నారు. ఆ మరుసటిరోజు అంటే నవంబరు 12న జస్టిస్ ఖన్నా సీజేఐగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఆరు నెలల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. వచ్చే ఏడాది మే 13న ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ చంద్రచూడ్ 2022 నవంబరు 9 న జస్టిస్ యూయూ లలిత్ స్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల కాలంలో రెండేళ్ల పాటు సీజేగా ఉన్నది చంద్రచూడ్ మాత్రమే. అంతేకాదు, జస్టిస్ చంద్రచూడ్ తండ్రి జస్టిస్ విశ్వనాథ్ చంద్రచూడ్ సుప్రీంకోర్టు 16 ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. అత్యధికాలం సీజేఐగా పనిచేసింది కూడా ఆయనే. ఏకంగా 7 సంవత్సరాల 139 రోజుల పాటు పదవీలో కొనసాగారు.

# సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయి

### గాలికి కొట్టుకు పోయిన

### బాబు సూపర్ సిక్స్‌లు

### కేబినేట్‌లో ఒక్కటైనా

### ఎందుకు చర్చించలేదు

### ఉద్యోగాల కల్పనపై మోడీతో

### శ్వేతపత్రం విడుదల చేయండి

### మీడియా సమావేశంలో

### పిసిసి చీఫ్ షర్మిల

విజయవాడ,అక్టోబర్17 : ఎన్నికల ముందు పథకాల పేరుతో మభ్యపెట్టి.. అధికారం చేపట్టాక ఆ హామీలను అమలు చేయడం లేదనికూటమి ప్రభుత్వంపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. గురువారం విజయవాడలో మీడియాతో మాట్లాడిన వైఎస్ షర్మిల.. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'నిన్నటి క్యాబినెట్ మీటింగ్‌లో సూపర్ సిక్స్‌లో ఒక్క సిక్స్ గురించి అయినా చర్చిస్తారు. ఒక్కటైనా అమలు చేస్తారని అనుకున్నాం. మహిళలకు శుభవార్త చెప్తారని అనుకున్నాం. ఉచిత సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఈ రెండూ లో బడ్జెట్ స్కీమ్‌లు. వీటిని అమలు చేస్తారని భావించాం. కానీ, ఎక్కడా వాటిని ప్రస్తావించలేదు. బాబు సూపర్ సిక్స్‌లు గాలికి కొట్టుకు పోయాయి. కొత్తగా సిక్స్ పాలసీలు వచ్చాయి. కొత్త పరిశ్రమలు వస్తే మంచిదే. పెట్టుబడులు రావాలి. ఉద్యోగాలు రావాలి. రూ. 30 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువస్తామన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జాబ్ ఫస్ట్ అనేది తమ నినాదం అని సీఎం చంద్రబాబు చెప్పారని షర్మిల గుర్తు చేశారు. 'మాటలన్నీ బాగానే చెప్పారు. కానీ, ఇక్కడే బిలియన్ డాలర్ల ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇవన్నీ అమలు చేసే చిత్తశుద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉందా? 2014లో పెద్ద పెద్ద పథకాలు అన్నారు. అమరావతిని సింగపూర్ అన్నారు. 3ఆ గ్రాఫిక్స్ చూపించారు. అప్పుడు చెప్పిన వాటికి, ఇప్పుడు చెప్పిన వాటికి తేడా లేదు. పాత సినిమాకి కొత్త టైటిల్ పెట్టారు. చంద్రబాబు చెప్తుంటే ఈ కథ ఎక్కడో విన్నట్లుంది
అనిపించింది. పాత గిఫ్ట్ కొత్త బాక్స్‌లో ఇస్తున్నారు. ఇవి అమలు అవుతాయా లేదా అనే అనుమానాలు ఉన్నాయని సందేహం వ్యక్తం చేశారు. 'సీఎం చంద్రబాబును ఒక విషయంలో స్వాగతిస్తున్నాం. జాబ్ ఫస్ట్ అనే నినాదం మంచిదే. రాష్ట్రంలో నిరుద్యోగం తారా స్థాయిలో ఉంది. ఉద్యోగాలు లేక వలసలు పోతున్నారు. గత 10 ఏళ్లుగా పరిశ్రమలు లేక యువత వలసలు వెళ్ళింది. రాష్ట్రానికి నిరుద్యోగం అతి పెద్ద సమస్య. నిన్న చంద్రబాబు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు 50 లక్షల మంది ఉన్నారు. ఈ లెక్కన బాబు చెప్పినట్లు ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు ఇస్తే..5 ఏళ్లలో 20 లక్షలు ఇస్తారు. ఏడాదికి 4 లక్షల ఉద్యోగాల కల్పన జరిగితే మిగతా వాళ్ల సంగతి ఏంటి..? ఉద్యోగాలు అని గతంలో మోడీ బీజేపీ ప్రభుత్వం కూడా మోసం చేసింది. 20 కోట్ల ఉద్యోగాలలో మనకు ఎన్ని వచ్చాయి ? ఒక్క ఉద్యోగం ఇవ్వని మోడీకి ఎందుకు చంద్రబాబుకు మద్దతు ఇస్తున్నారు ? రాష్ట్రంలో మీరు ఇచ్చే 20 లక్షలకు తోడు మరో 30 లక్షల ఉద్యోగాలు మోడీ ఇవ్వాలి. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు డిమాండ్ చేయాలి. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఇద్దరు కలిసి కూర్చొని ఉద్యోగాల కల్పన పై వైట్ పేపర్ రిలీజ్ చేయాలి.' అని షర్మిల డిమాండ్ చేశారు.'రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాల కల్పన చేస్తామని చెప్పిందో.. ప్రధాని మోదీ కూడా అన్ని ఉద్యోగాలు ఇవ్వాలి. రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల పరిధిలో దాదాపు 3 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఎప్పుడు చేస్తారో శ్వేత పత్రం విడుదల చేయాలి. గత 10 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ కావడం లేదు. మొత్తం ఎన్ని ఖాళీలు ఉన్నాయనేది తేల్చాలి. జాబ్ క్యాలెండర్ ప్రకారం అన్ని పోస్టులు భర్తీ చేయాలి. లోకేష్.. మోదీకి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారట. 21 మంది ఎంపీలు ఇస్తామని చెప్పి ఇచ్చారట. అయ్యా లోకేష్ గారు.. మీరు ఇచ్చిన మాట సరే.. మోదీ ఇచ్చిన మాట ఏంటి ? రాష్ట్రంలో ఉన్న 25 ఎంపీలు అందరూ మోదీకి ఊడిగం చేస్తూనే ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇస్తామని తిరుపతిలో నిలబడి మోదీ చెప్పారు. ఆయన ఇచ్చిన మాట ఎక్కడ పోయింది? హోదా వచ్చి ఉంటే.. పరిశ్రమల కోసం ఎక్కడికి పోవాల్సిన అవసరం లేదు. పోటీ పడి మరీ పరిశ్రమలు వస్తాయి. ప్రత్యేక హోదా ఉన్న ఉత్తరాఖండ్‌లో 2 వేల పరిశ్రమలు వచ్చాయి. హిమాచల్ ప్రదేశ్‌లో దాదాపు 10 వేల పరిశ్రమలు వచ్చాయి. మరి హోదా మీద మోదీ ఇచ్చిన మాట ఎక్కడ పోయింది? పోలవరం నాది భాధ్యత అని మోదీ అన్నారు. అమరావతిని న్యూ ఢిల్లీని మించిన రాజధానిని చేస్తామన్నారు. చేతిలో మట్టి కొట్టి పోయాడు తప్పితే ఒక్క రూపాయి ఇవ్వలేదు. వెనుక బడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అన్నారు.. ఇవ్వలేదు. విశాఖ స్టీల్‌కి ఒక్క క్యాపిటల్ మైన్ ఇస్తే మోదీకి జరిగే నష్టం ఏముంది..? ఇదే విషయాన్ని ప్రధాని మోదీని మంత్రి లోకేష్ అడగాలి.' అని షర్మిల డిమాండ్ చేశారు. 'సూపర్ సిక్స్ పాలసీలు సరే.. సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడికి పోయాయి. 20 లక్షల ఉద్యోగాలు అని అన్నారు. అంటే నిరుద్యోగ భృతి ఉన్నట్లా ? లేనట్లా ? నిరుద్యోగ భృతి మీద 2014 లోనే మీరు రూ. 2 వేలు ఇస్తాం అన్నారు. ఇప్పుడు రూ. 3 వేలు అంటున్నారు. ఇంత వరకు భృతిపై జాడ లేదు. తల్లికి వందనం నిధుల కోసం పిల్లలు ఎదురు చూస్తున్నారు. మహాలక్ష్మి పథకం కింద 15 వందలు అన్నారు.. ఏమయ్యింది ? ఉచిత సిలిండర్లకు దసరా అన్నారు.. దీపావళి అన్నారు.. రేపు సంక్రాంతి అంటారేమో.. ఇది చాలా తక్కువ బ్జడెట్ పథకం. ఏడాదికి రూ. 2 వేల నుంచి రూ. 4 వేల కోట్లకు ఖర్చు అయ్యే పథకానికి నిధులు లేవా? ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏమయ్యింది ? వైఎస్ జగన్‌కి తెలియదేమో.. హర్యానా ఎన్నికలతో ఏపీనీ ఎలా పోలుస్తారు ? ఏపీలో ప్రజల నాడికి అనుకూలంగా ఫలితాలు వచ్చాయి. హర్యానాలో ప్రజల నాడికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఏపీలో ఫలితాలు అనుకున్నట్లే వచ్చాయి. జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీదరించుకున్నారు. లిక్కర్ విషయంలో జగన్‌కి, చంద్రబాబుకు పెద్దగా తేడా ఏమీ లేదు. జగన్ హయంలో లిక్కర్ మాఫియా, తాడేపల్లి ప్యాలెస్‌కి లింక్ ఉంది. చంద్రబాబు హయాంలో నియోజకవర్గంలోని తమ్ముళ్ల చేతుల్లోకి మాఫియా ఉంది. ఇద్దరూ దొందూ దొందే. లిక్కర్ విషయంలో మొత్తం మాఫియా రాజ్యమే.' అంటూ వైఎస్ షర్మిల తనదైన శైలిలో హాట్ కామెంట్స్ చేశారు.

# జమిలి ఎన్నికలు వస్తే సిద్ధగా ఉండాలి

### ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైకాపా సిద్ధం

### ప్రజల్లోకి మనం ధైర్యం వెళుతున్నాం

### అధికార టిడిపి ప్రజల్లోకి వెళ్లేందుకు జంకు

### ఇచ్చిన హామీలు నెరవేర్చలేక చతికిల పడ్డారు

### దొంగకేసులతోనే పోలీసులకు సరిపోతోంది

### పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన జగన్

అమరావతి,అక్టోబర్17 : జమిలి ఎన్నికలు అంటున్నారని, అందువల్ల మనమంతా అందుకు సిద్ధంగా ఉండాలని వైకాపా అధినేత వైస్ జగన్ అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తగిన సమయం ఉంటుందని, పార్టీని మరింత పటిష్టం చేయడానికి మంచి అవకాశం ఉంటుందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ పేర్కొన్నారు. ప్రతిక్షంగానూ, అధికారంలోనూ, మళ్లీ ఇప్పుడు ప్రతిపక్షంగానూ పార్టీ ఉందన్నారు. అన్ని జిల్లా పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలతో వైఎస్ జగన్ సమావేశం అయ్యారు.
ప్రజల్లోకి మనం ధైర్యంగా వెళ్లగలుగుతామని.. టీడీపీ కూటమి కార్యకర్తలు ధైర్యంగా వెళ్లగలుగుతారా అంటూ జగన్ ప్రశ్నించారు. టీడీపీ వాళ్లు ప్రజల ఇళ్లకు పోయే పరిస్థితులు లేవన్నారు. ప్రతి కుటుంబానికి మంచి చేసే కార్యక్రమాలు మనం చేశామన్నారు. కాని, చంద్రబాబుగారు అబద్దాలకు రెక్కలు కట్టారని విమర్శించారు. ప్రతి ఇంటికీ వైసీపీ నాయకులు డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేశారని.. అమలు చేసిన హామీలే వైసీపీకి శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రిపేర్‌గా ఉండాల్సిన సమయం వచ్చిందన్నారు. 15 ఏళ్లలో పార్టీ ప్రస్థానం ముందుకు సాగిందన్నారు. కాకపోతే మనం ఆర్గనైజ్డ్‌గా యుద్ధంచేస్తున్నామా? లేదా? అన్నది చాలా ముఖ్యమని పేర్కొన్నారు. పార్టీ వ్యవస్థీకృతంగా ముందుకు సాగితేనే అది మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. అప్పుడే మనం రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ ఎఫెక్టివ్‌గా ఉంటామని పేర్కొన్నారు. జమిలి అంటున్నారు.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఆర్గనైజ్డ్‌గా ఉంటే మన సన్నద్ధంగా ఉంటామని పార్టీ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్ర స్థాయి నుంచిజిల్లాల వరకూ కమిటీలు ఎలా ఉన్నాయి? అన్నదానిపై పరిశీలన, అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ పాత్రలను నిర్వర్తించాలన్నారు. మరో ఆరు నెలల్లో మళ్లీ సమావేశం ఏర్పాటయ్యే నాటికి గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు కావాలని సూచించారు. అనుబంధాల విభాగాలకు గ్రామస్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు కావాలన్నారు. బూత్ కమిటీలు కూడా ఏర్పాటు కావాలని వైఎస్ జగన్ పేర్కొన్నారు. కమిటీలు ఏర్పాటన్నది కాగితాలకే పరిమితం కాకూడదన్నారు. దానివల్ల పార్టీకి ఎలాంటి లాభం ఉండదని.. కమిటీల ఏర్పాటపై పర్యవేక్షణ, పరిశీలన ఉండాలన్నారు. ఇలాచేయగలిగితే.. దేశంలోకెల్లా నంబర్ ఒన్ పార్టీగా మనం ఎదుగుతామన్నారు. డ్యూటీ మరిచిపోయి మూడు సింహాలకు సెల్యూట్ కాకుండా, రాజకీయనాయకులకు మడుగులొత్తుతున్నారు. ఎక్కడ చూసినా స్కాంలే కనిపిస్తున్నాయని జగన్ అన్నారు. 'ఇసుక టెండర్లకు రెండు రోజులే గడువు. కనీసం టెండర్లు పిలుస్తున్నారన్న విషయం ఎవ్వరికీ తెలియదు. టెండర్లు వేయడానికి ఎవ్వరూ కూడా పోని పరిస్థితి. ఇసుక రేటు మన హయాంకన్నా డబుల్ రేటు, ట్రిపుల్ రేటు. మన హయాంలో ప్రజలకు రీజనబుల్ రేట్లకు ఇసుక వచ్చేది. ప్రతి ఆదివారం ప్రతి నియోజకవర్గంలో రేట్లు ఇచ్చేవాళ్లం. అక్రమాలకు పాల్పడితే? కేసులు పెట్టేవాళ్లం. అంత పగడ్బందీగా మనం అమలు చేశాం. ఉన్న షాపులు తగ్గించి, పర్మిట్ రూమ్స్ పెట్టి, టైమింగ్స్ తేసేసి, బెల్టుషాపులు లేకుండా చూసి, వాల్యూమ్స్ తగ్గించి? ప్రజలకు మంచిచేసేలా చూశాం.'అని జగన్ కూటమి సర్కారు గురించి విమర్శలు గుప్పించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 18 అక్టోబర్ 2024








# టీమిండియా చెత్త రికార్డు


## 46 పరుగులకే కుప్పకూలిన భారత్

## 134 పరుగుల ఆధిక్యంలో న్యూజిలాండ్

**బెంగళూరు:** టీమ్ఇండియాతో జరుగుతున్న మ్యాచ్‌లో న్యూజిలాండ్ భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. తొలుత బంతితో అదరగొట్టి మొదటి ఇన్నింగ్స్‌లో భారత జట్టును 46 పరుగులకే ఆలౌట్ చేసిన కివీస్.. తర్వాత బ్యాటింగ్ లోనూ సత్తాచాటుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమ యానికి 3 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర (22 బ్యాటింగ్), డారిల్ మిచెల్ (14 బ్యాటింగ్) నాటౌట్‌గా క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం న్యూజిలాండ్ 134 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఓపెనర్ డెవాన్ కాన్వే (91బీ 105 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సలు) దూకుడుగా ఆడి శతకం ముంగిట పెవిలియన్ చేరాడు. విల్ యంగ్ (33), టామ్ లాథమ్ (15) పరుగులు చేశారు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, అశ్విన్ తలో వికెట్ పడగొట్టారు. కాన్వే ఆరంభం నుంచే దూకుడుగా ఆడగా.. టామ్ లాథమ్ అతడికి సహకరించాడు. లాథమ్‌ను కుల్‌దీప్ యాదవ్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో 67 పరుగుల వద్ద కివీస్ మొదటి వికెట్ కోల్పోయింది. తర్వాత విల్ యంగ్‌తో కలిసి కాన్వే ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. విల్ యంగ్‌ను జడేజా ఔట్ చేయడంతో 75 పరుగుల పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే అశ్విన్ బౌలింగ్‌లో కాన్వే రివర్స్ స్విప్ షాట్ ఆడబోయి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 44 పరుగులకే కుప్పకూలింది. స్వదేశంలో టీమ్‌ఇండియాకిదే అత్యల్ప స్కోరు. రిషభ్ పంత్ (20), యశస్వి జైస్వాల్ (13) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. రోహిత్ శర్మ, కోహ్లీ, సర్ఫరాజ్ ఖాన్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా డకౌటయ్యారు. హెన్రీ (15/5), ఓరౌర్కీ (4/22) టీమ్‌ఇండియా పతనాన్ని శాసించారు. టిమ్ సౌథీ ఒక వికెట్ తీశాడు.



## టీమిండియా ఆటగాళ్ల తీరుపై
# కుంబ్లే పెదవి విరుపు
### ఆటతీరులో లోపం కనిపించిందని వ్యాఖ్య



**బెంగళూరు, అక్టోబర్ 17 :** న్యూజిలాండ్‌తో మొదలైన తొలి టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఘోరంగా విఫలమై కేవలం 46 పరుగులకే కుప్పకూలడంపై మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అసంతృప్తి వ్యక్తం చేశాడు. జట్టులో ఒక రకమైన ఆటతీరు లోపించిందన్నాడు. భారత్ పూర్తిగా ఎదురు దాడి చేద్దామని ప్రయత్నించిందని అభిప్రాయపడ్డాడు.'విరాట్ కోహ్లీ నాలుగో స్థానంలోనే బరిలోకి దిగాలి. ఆ స్థానంలో అతడే మీ టాప్ బ్యాటర్. ఇక 3వ స్థానం కోసం ఛతేశ్వర్ పుజారా వంటి ఆటగాడు అవసరం. కొన్నేళ్లపాటు నెంబర్-3గా అతడు జట్టుకు సేవలు అందించాడు. నేడు పుజారా జట్టులో ఉంటే.. అలా వికెట్ పోగొట్టుకొనేవాడు కాదు. బంతి మీదకు వచ్చే వరకు ఆగి ఓపిగ్గా ఆడేవాడు. జట్టులో అలాంటి ఆటగాడు లోపించాడు. ఆ రకమైన ఆట లోపించింది. ఈ అంశంలో భారత్ కచ్చితంగా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది' అని కుంబ్లే పేర్కొన్నాడు. దాదాపు పదేళ్లపాటు టీమ్ ఇండియా టెస్ట్ జట్టు బ్యాటింగ్‌లో మూడో స్థానాన్ని పుజారా బలోపేతం చేశాడు. 2023 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ తర్వాత జట్టుకు దూరమయ్యాడు. గిల్ అతడి స్థానంలో టీమ్ ఇండియాలోకి వచ్చాడు. టీమ్ కుప్పకూలిపోయే పరిస్థితుల్లో ఉన్నప్పుడు పుజారా కాపాడిన సందర్భాలు కోకొల్లలు. తన బలమైన డిఫెన్స్‌తో జట్టుకు అండగా నిలిచాడు. తాజాగా న్యూజిలాండ్ మ్యాచ్‌కు గిల్ దూరం కావడంతో కోహ్లీ ఓ స్థానం ముందుకు వచ్చి నెంబర్-3గా దిగాడు. ఈ స్థానంలో బరిలోకి దిగడం ఎనిమిదేళ్లలో ఇదే తొలిసారి. రోహిత్ వికెట్ పడగానే మైదానంలోకి వచ్చిన అతడు పరుగులేమీ చేయకుండానే పెవిలియన్‌కు చేరుకొన్నాడు. వాస్తవానికి నెంబర్-3లో కోహ్లీ ప్రదర్శన ఏమీ అంతగొప్పగా లేదు. ఆరు మ్యాచ్‌ల్లో ఈ స్థానంలో బరిలోకి దిగి 16.16 సగటుతో కేవలం 97 పరుగులు మాత్రమే చేశాడు. ఈ స్థానంలో అతడు డకౌట్ కావడం ఇదే తొలిసారి. బెంగళూరులోని చిన్నస్వామి మైదానంలో భారత్‌కు న్యూజిలాండ్ బౌలర్లు చుక్కలు చూపించారు. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 31.2 ఓవర్లలోనే 46 పరుగులకే ఆలౌటైంది. ఐదుగురు బ్యాటర్లు డకౌట్ కావడం గమనార్హం. ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోరు చేశారు.



# పంత్‌కు గాయం
### మైదానం వీడి పెవిలియన్ దారి
### కోలుకుని వస్తాడని రోహిత్ ఆశాభావం

**బెంగళూరు, అక్టోబర్ 17 :** న్యూజిలాండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో టీమ్‌ఇండియా వికెట్‌కీపర్ రిషభ్ పంత్ గాయపడి మైదానం వీడిన సంగతి తెలిసిందే. కివీస్ ఇన్నింగ్స్‌లో 37వ ఓవర్ జడేజా వేయగా.. చివరి బంతికి కాన్వే షాట్ ఆడేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఈ క్రమంలో బంతి ఆఫ్ స్టంప్ మీదుగా వెళ్లి పంత్ మోకాలికి తగిలింది. దీంతో అతడు నొప్పితో విలవిల్లాడాడు. ఫిజియోలు వచ్చి పంత్‌కు చికిత్స అందించారు. అయితే, నొప్పి తాళలేక అతడు మైదానాన్ని వీడాడు. అనంతరం ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ చేశాడు. రెండో రోజు ఆట ముగిసిన తర్వాత పంత్ గాయంపై కెప్టెన్ రోహిత్ శర్మ అప్‌డేట్ ఇచ్చాడు. 'దురదృష్టవశాత్తూ బంతి సరిగ్గా పంత్ మోకాలి చిప్పకు తాకింది. అదే కాలికి గతంలో సర్జరీ జరిగింది. అందుకే మోకాలు వాపు వచ్చింది. కండరాలు కూడా పట్టేశాయి. మేం రిస్క్ తీసుకోదల్చుకోలేదు. అందుకే ముందు జాగ్రత్త చర్యగా అతడిని డ్రెస్సింగ్ రూమ్‌కి పంపించాం. రిషభ్ పంత్ కూడా మాకు ఇదే విషయం చెప్పాడు. పెద్ద సర్జరీ జరిగిన కాలికే గాయం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. ఈ రోజు (గురువారం) రాత్రి అతడు కోలుకుని శుక్రవారం మైదానంలోకి అడుగుపెడతాడని ఆశిస్తున్నాం' అని రోహిత్ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 46 పరుగులకే ఆలౌట్ కాగా.. పంత్ (20) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.



# ఆరెంజ్ ఆర్మీకి కొత్త కోచ్..?

ఐపీఎల్ 18వ సీజన్‌కు ముందే మాజీ చాంపియన్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు పెద్ద షాక్. బౌలింగ్ కోచ్‌గా సేవలందిస్తున్న పేస్ దిగ్గజం డేల్ స్టెయిన్ ఫ్రాంచైజీకి గుడ్ బై చెప్పేశాడు. తాను వచ్చే సీజన్‌కు అందుబాటులో ఉండనని ఈ దక్షిణాఫ్రికా లెజెండ్ ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యానికి స్పష్టం చేశాడు. 'బౌలింగ్ కోచ్‌గా కొన్ని ఏండ్లు నన్ను కొనసాగించినందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ధన్యవాదాలు. అయితే.. దురదృష్టవశాత్తూ నేను ఐపీఎల్ 2025కి అందుబాటులో ఉండడం లేదు. కానీ, దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా కొనసాగుతాను' అని స్టెయిన్ తన ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించాడు. స్టెయిన్ స్థానంలో న్యూజిలాండ్‌కు చెందిన జేమ్స్ ఫ్రాంక్లిన్‌కు ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్ ఫ్రాంచైజీ. ప్రపంచంలోని మేటి పేసర్లలో ఒకడైన స్టెయిన్ ఐపీఎల్‌లోనూ బ్యాటర్లను వణికించాడు. సన్‌రైజర్స్ మాజీ ఆటగాడైన అతడు 2022లో ఆ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా వచ్చాడు. సుదీర్ఘ అంతర్జాతీయ, ఐపీఎల్ అనుభవం గల అతడు యువకెరటం ఉమ్రాన్ మాలిక్‌ను గొప్పగా తీర్చిదిద్దాడు. అతడి హయాంలో రాటుదేలిన ఉమ్రాన్ జాతీయ జట్టులోకి సైతం వచ్చాడు. ఇక.. 17వ సీజన్‌లో స్టెయిన్ తన వ్యూహాలతో ప్యాట్ కమిన్స్ సారథ్యంలోని బౌలింగ్ యూనిట్‌ను దుర్భేద్యంగా మర్చాడు. కానీ.. తీరా ఫైనల్లో హైదరాబాద్ జట్టు చెత్త ఆటతో ఓడిపోయి రెండో ట్రోఫీ అందకొనే అవకాశాన్ని చేజార్చుకుంది.



# హెన్రిచ్ క్లాసెన్‌కే 23 కోట్లు..?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ మెగా వేలం కోసం సిద్ధమవుతోంది. 'రైట్ టు మ్యాచ్'తో కలిపి ఆరుగురిని అట్టిపెట్టుకొనేందుకు బీసీసీఐ అవకాశం ఇవ్వడంతో ఎవరిని వదిలేయాలి? అనేదానిపై కసరత్తు మొదలెట్టింది. రిటైన్ చేసుకొనే ఆటగాళ్లపై హైదరాబాద్ యాజమాన్యం చాలా స్పష్టతతో ఉన్నట్టు సమాచారం. అంతేకాదు ఈసారి రికార్డు ధరకు ఎవరిని రిటైన్ చేసుకోవాలో కూడా ఫ్రాంచైజీ ఓ నిర్ణయానికి వచ్చిందట. అలాగని.. ఇంకెవరు జట్టును ఫైనల్ చేర్చిన కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అనుకుంటే మీరు పొరబడినట్టే. గత రెండు సీజన్లలో అదరగొట్టిన చిచ్చరపిడుగు హెన్రిచ్ క్లాసెన్‌కు రూ.23 కోట్లు చెల్లించేందుకు హైదరాబాద్ యాజమాన్యం సిద్ధ పడుతోంది. పదిహేడో సీజన్‌లో అద్భుతంగా రాణించిన ఆటగాళ్లను హైదరాబాద్ ఫ్రాంచైజీ అట్టిపెట్టుకోనుంది. ముఖ్యంగా మినీ వేలంలో రికార్డు ధర పలికి జట్టు పగ్గాలు చేపట్టిన కమిన్స్, విధ్వంసక ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మలతో పాటు హెన్రిచ్ క్లాసెన్‌లను ఆరెంజ్ జట్టు రిటైన్ చేసుకోనుంది. ఇక బంగ్లాదేశ్‌పై టీ20 సిరీస్‌లో దంచికొట్టిన యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిని సైతం అట్టిపెట్టుకొనే అవకాశముంది. అయితే.. రూ. 23 కోట్లతో క్లాసెన్‌ను రిటైన్ చేసుకోనున్న ఎస్ఆర్‌హెచ్.. కమిన్స్‌కు రూ.18 కోట్లు, ఓపెనర్ అభిషేక్ శర్మకు రూ.14 కోట్లు ముట్టజెప్పనుందని టాక్. మరోవైపు.. పదిహేడో సీజన్‌లో తీవ్రంగా నిరాశపరిచిన ఆల్‌రౌండర్ అబ్దుల్ సమద్, రాహుల్ త్రిపాఠిలను వదిలించుకునే పనిలో ఉంది హైదరాబాద్ ఫ్రాంచైజీ.



# దిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా హేమంగ్ బదానీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 17 :** దిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ హేమంగ్ బదానీ బాధ్యతలు చేపట్టనున్నాడు. అటు..ఫ్రాంఛైజీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా భారత మాజీ ఆటగాడు వేణుగోపాల్ రావును దిల్లీ క్యాపిటల్స్ నియమించింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. ఏడేళ్లపాటు దిల్లీ హెడ్ కోచ్‌గా ఉన్న రికీ పాంటింగ్‌ను ఇటీవల తొలగించిన సంగతి తెలిసిందే. గత సీజన్ వరకు దిల్లీ ఫ్రాంఛైజీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా సౌరభ్ గంగూలీ కొనసాగాడు. తాజాగా అతడి స్థానంలో వేణుగోపాల్ రావుకు ఆ బాధ్యతలు అప్పగించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News





# చిత్రసీమ అండతోనే ధైర్యంగా నిలబడ్డా

## కొండా సురేఖ వ్యాఖ్యలపై మరోమారు స్పందించిన సమంత

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై సమంత మరోసారి స్పందించారు. తన వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ' ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో దీని గురించి మాట్లాడారు. ఇటీవల చర్చనీయాంశమైన కొండా సురేఖ వ్యాఖ్యల గురించి ప్రస్తావించగా.... సమంత ఈవిధంగా స్పందించారు. 'ఈరోజు ఇక్కడ కూర్చోవడానికి ఎంతోమంది మద్దతు కారణం. చిత్రసీమకు చెందిన ప్రముఖుల ప్రేమ, నాపై వారికి ఉన్న నమ్మకమే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. వారు నాలో ధైర్యం నింపారు. కష్టాలను ఎదుర్కోవడంలో వారి మద్దతు నాకెంతో సాయపడింది. వారు నా పక్షాన నిలవకపోతే కొన్ని పరిస్థితులను అధిగమించేందుకు చాలా సమయం పట్టేది. నా చుట్టూ ఉన్నవారి నమ్మకం వల్లే సమస్యలను ఎదుర్కోగలిగాను' అని అన్నారు. ఆన్‌లైన్ ట్రోలింగ్‌లపై సమంత స్పందిస్తూ.. అలాంటి వాటి గురించి ఎక్కువ ఆలోచించను అని అన్నారు. 'ద్వేషపూరిత సందేశాలను స్వీకరించినప్పుడు వాటి ప్రభావం నాపై పడకుండా చూసుకుంటాను. దాన్ని పంపిన వారు కూడా అలాంటి బాధనే అనుభవించారేమో అని ఆలోచిస్తాను' అని తెలిపారు. ఇక తన అనారోగ్య కారణం వల్ల 'సిటాడెల్: హనీ బన్నీ'ను తిరస్కరించాలని భావించినట్లు సమంత చెప్పారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్‌లో ఆమె స్పై ఏజెంట్‌గా నటించారు. దీని గురించి మాట్లాడుతూ.. దర్శకులు నన్ను ఈ సిరీస్ కోసం సంప్రదించగానే నేను చేయలేనని చెప్పాను. ఈ పాత్రను చేయగలనని నిజంగా అనుకోలేదు. దానికి సరిపోయే నలుగురు హీరోయిన్ల పేర్లను కూడా రాజ్ అండ్ డీకే కు సిఫార్సు చేశాను. వాళ్లు అయితే ఈ పాత్రకు కచ్చితంగా న్యాయం చేయగలరని చెప్పాను. నేను చేయలేనని వేడుకున్నా. అయినా వాళ్లు పట్టుబట్టి నాకోసం వేచిచూశారు. ఇప్పుడు సిరీస్ పూర్తయ్యాక ఇంత గొప్ప పాత్ర ఇచ్చిన దర్శకులకు థ్యాంక్స్ చెప్పాను. మరొకరిని తీసుకోకుండా నాతో చేయడం నా అదృష్టంగా భావించానని చెప్పారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో తెరకెక్కిన 'సిటాడెల్: హనీ బన్నీ'లో సమంత, వరుణ్ ధావన్‌లు ప్రధానపాత్రల్లో నటించారు. నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్ వేదికగా ఈ సిరీస్ అందుబాటులో ఉండనుంది.




# డియర్ స్టూడెంట్స్'తో వస్తున్న నయనతార

లేడీ సూపర్‌స్టార్ నయనతార వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'టెస్ట్ , 'మన్నాన్‌గట్టి 1960' చిత్రాలు పూర్తి చేసిన ఆమె ప్రస్తుతం 'డియర్ స్టూడెంట్స్'తో సినిమాతో బిజీ కానుంది. ఇటీవల చిత్ర బృందం ఆమెను సెట్‌లోకి ఆహ్వానించారు. ఈ విషయాన్ని తెలుపుతూ నయన్ ఓ ఫొటో షేర్ చేశారు. కాలేజీ స్టూడెంట్స్ చుట్టూ తిరిగే ఈ వినోదాత్మక చిత్రాన్ని సందీప్ కుమార్, జార్జ్ ఫిలిప్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. నివిన్ పాలీ కీలక పాత్ర పోషిస్తున్నారు. 'లవ్ యాక్షన్ డ్రామా' చిత్రం తర్వాత నివిన్, నయన జంటగా నటిస్తున్న చిత్రమిది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇందులో నయన విద్యా రుద్రన్ అనే టీచర్‌గా కనిపించనున్నటు సమాచారం. ప్రస్తుతం నయన జాబితాలో 'అమ్మోరు 2', 'తని ఒరువన్ 2' చిత్రాలున్నాయి.గతేడాది జవాన్, ఇరైవన్, అన్నపూర్ణ చిత్రాలతో అలరించారు నయన్.

# త్రిప్తి.. తృప్తి.. సంతృప్తి..!

గ్లామర్ ఫీల్డ్ లో ఎన్నాళ్ల నుంచి పనిచేస్తున్నాం అన్నది కాదు ఎప్పుడు క్రేజ్ తెచ్చుకున్నాం అన్నది ఇంపార్టెంట్. అలాంటి విషయాలు తమకు రావాల్సిన గుర్తింపు లేట్ గా వచ్చిన వారికి బాగా అర్థమవుతుంది. అలాంటి వారిలో కచ్చితంగా బాలీవుడ్ అందాల భామ త్రిప్తి డిమ్రి ఉంటుంది. యానిమల్ సినిమాలో ఛాన్స్ ఆమె ఫేట్ మార్చేసిందని చెప్పొచ్చు. అంతకుముందు కూడా త్రిప్తి సినిమాలు, వెబ్ సీరీస్ లు చేసింది కానీ ఆమెకు సరైన గుర్తింపు రాలేదు. కానీ ఎప్పుడైతే యానిమల్ రిలీజైందో బీ టౌన్ ఆడియన్స్ అంతా త్రిప్తి పేరునే జంపించేలా చేసింది. ఆ సినిమాలో హీరోయిన్ గా నటించిన రష్మిక కన్నా త్రిప్తికే ఎక్కువ పాపులారిటీ వచ్చిందని చెప్పొచ్చు. ఇక ఒక్కసారి లైం లైట్ లోకి వచ్చాక ఆఫర్లు వాటంతట అవే వచ్చేస్తాయి. అందులో భాగంగానే త్రిప్తి వరుస అవకాశాలు అందుకుంటుంది. యానిమల్ తర్వాత తన కెరీర్ పరంగా వేగాన్ని పెంచుకున్న త్రిప్తి సినిమాల సక్సెస్ రేటు ఎలా ఉన్నా తన పేరు వినిపించేలా చేసుకుంటుంది.

ఇక సినిమా ఫలితాలు ఎలా ఉన్నా వాటితో పాటు సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో కూడా త్రిప్తి ఇంప్రెస్ చేస్తుంది. తన మార్క్ గ్లామర్ షో చేస్తూ త్రిప్తి తన ఫాలోవర్స్ ని సంతృప్తి చెందేలా చేస్తుంది. లేటెస్ట్ గా అద్దం ముందు చీరందంతో అమ్మడు చేస్తున్న గ్లామర్ షో ఆడియన్స్ కు పిచ్చెక్కిస్తుందంటే నమ్మాల్సిందే. తన చూపులతో త్రిప్తి చేస్తున్న క్రేజీ స్కిన్ షో కుర్రాళ్ల మతులు పోగొతుంది.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986